RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :63 ఆదివారం 31 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## గవర్నర్ ను కలిసిన మండలి విపక్షనేత మధుసూధన చారి



హైదరాబాద్:లోక్ భవన్ లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ నేతలు మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి మరియు సహకార సంఘాల చైర్మన్లు కలిసారు. సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా మధుసూదనా చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా సహకార సంఘాల్లో నామినేటెడ్ వ్యక్తులను నియమించాలని చూస్తోంది. ఇది సహకార సంఘాల చట్టానికి విరుద్ధం 2020లో గెలిచిన చైర్మన్ల పదవీకాలం 2025 వరకు ఉంది. ఎన్నికలు జరపకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని నామినేట్ చేయాలని చూస్తోందని అన్నారు. ఈ అంశంపై గవర్నర్కు వినతి పత్రం అందజేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరాం . ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా, లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్తామని గవర్నర్ హామీ ఇచ్చారని అన్నారు.

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## కాంట్రాక్టు వ్యవస్థలో అన్యాయం జరుగుతోంది..

**ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, మే 30:** నగరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ.. కాంట్రాక్టర్ల సమస్యలు, హామీల అమలు తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'కేసీఆర్ హయాంలో అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయమని చెప్పారు. ఒక్కో విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి పెట్టి తొమ్మిదిన్నర ఏళ్ళు చదివించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చారు. రేవంత్.. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుడతారా అని సీఎం అంటున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుట్టరని తెలుసు.. 30నెలల్లో కూడా పిల్లలు పుట్టకుంటే ఏమంటారు? కాంట్రాక్టులన్నీ సీఎం బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకు వస్తున్నాయి. ముఖం బాగాలేక అద్దం పగుల కొట్టినట్లు ఉంది పరిస్థితి . కేసీఆర్ అప్పుల పాలు చేశారు అంటున్నాడు. కేసీఆర్ అప్పు చేసి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి పోదాం.. జీవో నెంబర్ 17 రద్దు అయ్యేవరకు పోరాడుదాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. సెక్యూరిటీ లేకుండా రోడ్డు మీదకు రండి.. మీకు పరిస్థితి తెలుస్తుంది. మళ్ళీ 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది' అని కేటీఆర్ అన్నారు.

## ఎస్ఐ ఆర్ పైన అందరు అవగాహన పెంచుకోవడం సంతోషం

**సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్:** ఎస్ఐఆర్ పైన అందరు అవగహన పెంచుకోవడం సంతోషం ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం.ఎస్ఐఆర్ లంబాడీలు,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు.కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారు మహిళలకు కూడా ఎస్ఐఆర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చు.ఎస్ఐఆర్ వల్ల దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉంది ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించాం ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించాం. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలి డిజిటల్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంఛార్జ్ ను నియమించి నిరంతరం పర్యవేక్షించాం ఎస్ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు,17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇంఛార్జ్ ల నియమించాలి.అసెంబ్లీ ఇంఛార్జ్ లు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే ఇంఛార్జ్ లు కరెక్ట్ గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చు.ఇంఛార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలి క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇంఛార్జ్ మంత్రులు కలవాలి.నేను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాను నెలలో మూడు **రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తా** పార్టీ కోసం పనిచేయాల్సిందే. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, - మిగతా5లో

## కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై బండారు దత్తాత్రేయ ఆందోళన

**గోదావరిఖనిలో పర్యటించిన బండారు దత్తాత్రేయ**

**లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందన్న మాజీ గవర్నర్**

**మూడు ప్రధాన ప్రాజెక్టుల్లో బొట్టు నీరు లేదని ఆవేదన**



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా - మిగతా5లో

## చదువే ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం

**అంగన్వాడీల బలోపేతం నుంచి బాలికల సాధికారత వరకు ప్రజా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ**

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క**



హైదరాబాద్:కొంగరకలాన్లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం, అంగన్వాడీ యూనిఫార్మ్ల పంపిణీ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుంది. ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతాం" అని పేర్కొన్నారు. బాలికలు కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతో పాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు.స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకు పైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటుచేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని - మిగతా5లో

## ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం

**రైతుల ఇబ్బందులపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్రావు**



హైదరాబాద్:ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు ముందుగా రైతుల వద్దకు వెళ్లి వారి గోసలు, సమస్యలు ఏమిటో తెలుసుకోవాలి. కాంగ్రెస్ నాయకులు జిల్లాల బాట పడుతున్నామని చెబుతున్నారు. అయితే వారు చేసిన తప్పిదాలు, నిర్లక్ష్యానికి సమాధానం చెప్పకుండా ఏ బాట పట్టినా అది చివరకు అవినీతి బాటగానే మిగిలిపోతుంది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా కేంద్ర ప్రభుత్వానికి ఇండెంట్ పంపించాలి. తాము ఎంత ధాన్యం సేకరించనున్నామో, దానికి ఎంత రీయింబర్స్మెంట్ అవసరమో తెలియజేయడం విధి విధానాల్లో భాగం. సాధారణంగా పంట కోతకు ముందే కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పంట ఉత్పత్తిపై అంచనాలు రూపొందించి కేంద్రానికి ఇండెంట్ పంపిస్తారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేసింది. చివరి వరకు సరైన అంచనాలు రూపొందించకపోవడమే కాకుండా, కేంద్రానికి ఇండెంట్ కూడా సకాలంలో పంపలేదని అన్నారు.వాస్తవానికి మార్చి 23 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 25 నుంచి మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించింది. ఈ జాప్యం కారణంగా లారీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరాలో లోపాలు ఏర్పడ్డాయి. అకాల వర్షాల సమయంలో రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా రీయింబర్స్ చేస్తోంది. అయితే కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని అయన అన్నారు.

## ఢిల్లీకి చేరిన.. తెలంగాణ పంచాయితీ



**హైదరాబాద్, మే 30:** కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో అధికార పక్షంలో ఒక భాగమైంది. కీలకమైన పశ్చిమ బెంగాల్లో.. అస్సాంలో.. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. కనీసం చెప్పుకునే స్థాయిలో శాసనసభ స్థానాలను దక్కించుకోలేకపోయింది.క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇప్పుడు వచ్చే వాళ్ళతో.. పోయే వాళ్లతో అత్యంత రద్దీగా ఉంది. రాహుల్ గాంధీ కూడా మల్లికార్జున కార్గే.. వేణుగోపాల్ రెడ్డి వంటి వారితో నిత్యం సమావేశాలు పెడుతున్నారు. ఏం జరిగి ఉంటుంది.. ఏం జరుగుతోంది అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నప్పుడే.. తెలంగాణ నేతలు అక్కడ కనిపిస్తున్నారు. కొద్దిరోజుల వరకు సాగిన కర్ణాటక పంచాయతీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడంతో ముగిసింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ పంచాయతీ ప్రారంభమైంది. అలాగని తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు జరగడం లేదు. రేవంత్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుకోవడం లేదు.కాకపోతే కొంతమంది మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు.. తమ శాఖలలో పిచ్చిపిచ్చి పనులు చేస్తున్నట్టు అధిష్టానానికి నివేదిక అందింది. ఇటీవల మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి - మిగతా5లో

## రైతు ముసుగులో కేసీఆర్ రాజకీయం

**సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మే** : తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర (మీస్రా) ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్తే, తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం, హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు యుద్ధ తంత్రం!

పశ్చిమాసియాలో త్వరలోనే శాంతి నెలకొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి శుభవార్త చెప్పారు. ఇరాన్ కూడా యురేనియం వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ఇక అంతా మంచే జరుగుతుందని భావిస్తున్న వేళ అమెరికా ఆత్మరక్షణ పేరుతో ఇరాన్‌పై భీకర దాడులు మొదలు పెట్టింది. మరోమారు తన సైనిక బలాన్ని ప్రదర్శించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల్లోని బందర్ అబ్బాస్, క్వెష్మ్ పోర్టు సమీపంలోని సైనిక స్థావరాలు, క్షిపణి లాంచ్ ప్యాడ్లు, సముద్రంలో మైన్లు (మందుపాతరలు) పరచే బోట్లు, నేవీ బేస్‌లపై తీవ్ర దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతీ హాకిన్స్ ఈ దాడులను "ఆత్మరక్షణ చర్య"గా సమర్థించారు. ఇరాన్ తీరం వెంట ఉన్న క్షిపణి స్థావరాలు తమ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలకు నేరుగా ముప్పు కలిగించాయని, మందుపాతరలు పరచడానికి ప్రయత్నించే బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు మరణించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు కొన్ని వార్తా వర్గాలు పేర్కొన్నాయి.ప్రపంచ ఇంధన మార్గాల్లో ఆక్సిజన్‌గా భావించే హార్ముజ్ జలసంధి దాదాపు మూడు నెలలుగా స్తబ్దంగా మారింది. అమెరికా?ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈ కీలకమైన నౌకా మార్గాన్ని అడ్డుకోవడంతో, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి 1967 సూయజ్ కాలువ సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది.1967 అరబ్?ఇజ్రాయెల్ యుద్ధంలో సూయజ్ కాలువలో 15 నౌకలు చిక్కుకుపోయి, ఎనిమిదేళ్లపాటు అక్కడే కూరుకుపోయాయి. 'ఎల్లో ఫ్లీట్'గా ప్రసిద్ధి చెందిన ఆ నౌకలు తుప్పు పట్టి, చరిత్రలో ఒక హెచ్చరికగా మిగిలిపోయాయి. ఇప్పుడు హార్ముజ్‌లోనూ అదే దృశ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులు ఈ దిగ్బంధనం కొనసాగుతుందో, ఎన్ని ఓడలు ఈ జలసంధిలో నిలిచిపోతాయో ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ సంక్షోభం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించినా, వాస్తవం మాత్రం తీవ్రంగా ఉంది.సంక్షోభం ప్రారంభం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్పష్టమైన దూరదృష్టితో ముందుకు వెళ్తోంది. హార్ముజ్‌పై ఆధారపడకుండా చమురు రవాణా చేసేందుకు ప్రత్యామ్నాయ పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావొచ్చని అంచనాలు ఉన్నాయి. దౌత్య చర్చలు జరుగుతున్నా, దీర్ఘకాలిక ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని అబుదాబి అంచనా వేస్తోంది. ఇది ఒక దేశం మాత్రమే కాదు, మొత్తం గల్ఫ్ ప్రాంతం యొక్క భద్రతా వ్యూహంలో భాగం.సంక్షోభం త్వరలో ముగిసి, చమురు ధరలు అనియంత్రితంగా పెరగకుండా సమతుల్యత నిలుస్తుందని వారు నమ్ముతున్నారు. అయితే ఈ ఆశలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చేయనేది ప్రశ్నార్థకం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు సరఫరా అంతరాయం కలిగింది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిల్వలు విడుదల చేయడం ద్వారా తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రించగలిగాయి. కానీ ఈ నిల్వలు ఎప్పటికప్పుడు అయిపోతాయి.ఇరాన్ సంకల్పం. ఆర్థిక ఒత్తిడిఇరాన్ వైపు చూస్తే, తీవ్రమైన ఆర్థిక సవాళ్ల మధ్య కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, ఉనికి కోసం పోరాటం కొనసాగుతోంది. రెండు వైపులా 'ముందుగా ఎవరు ఒప్పుకుంటారు' అని వేచి చూడడం జరుగుతోంది. ఇలాంటి స్థిరత్వం లేని ఎదురు చూపు ప్రపంచానికి మరింత నష్టం కలిగిస్తుంది. హార్ముజ్‌ను శాశ్వతంగా మూసివేయడం ఎవరికీ లాభదాయకం కాదు. త్వరిత తాత్కాలిక ఒప్పందం అవసరం. అయితే గత చరిత్ర చెప్పినట్లు, ఒక్కసారి సాధారణమైన సంక్షోభాలు కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఇంధన భద్రత ఇకపై భౌగోళిక రాజకీయాలపై ఆధారపడి ఉండదు. వైవిధ్యపరమైన సరఫరా మార్గాలు, పునరుత్పాదక ఇంధనాల వైపు వేగవంతమైన మార్పు, ప్రాంతీయ దేశాల మధ్య సహకారం ? ఇవి భవిష్యత్ కోసం అనివార్యమైన అడుగులు.చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, ఆర్థిక వ్యవస్థలు మాత్రమే కాదు, సమగ్ర ప్రపంచ స్థిరత్వం కూడా ప్రమాదంలో పడుతుంది. సమయం ఇంకా ఉంది, కానీ చాలా తక్కువగా ఉంది.ఏప్రిల్ 7న ప్రకటించిన సీజ్‌ఫైర్ అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇది ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరిక. దోహాలో జరుగుతున్న కీలక దౌత్య ప్రయత్నాలుదాడులు జరుగుతున్న అదే సమయంలో ఖతార్ రాజధాని దోహాలో ఇరాన్?అమెరికా దూతల మధ్య కీలక చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం ఈ సంప్రదింపుల్లో పాల్గొంటోంది. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు, అయితే ఇంకా కొన్ని కీలక సమస్యలు మిగిలి ఉన్నాయని తెలిపారు.ఇరాన్ ప్రధాన దృష్టి యుద్ధ ముగింపు (లెబనాన్‌తో సహా) వైపే ఉందని, ప్రస్తుతం అణు అంశాలను చర్చించడం లేదని స్పష్టం చేశారు.యుద్ధం పూర్తిగా ముగిస్తే 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత చర్చలు ప్రారంభించవచ్చని సంకేతాలిచ్చారు. ఖతార్ మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కీలకమవుతోంది. లెబనాన్‌పైనా దాడులు జరగకుండా ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది.ఈ తరుణంలో అమెరికా 33 మిసైల్ సైట్లలో దాదాపు 30ను తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 70 శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించింది. ఇది ఇరాన్ ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇప్పటికీ కాపాడుకోవాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు అమెరికా దాడులు ఇరాన్‌ను మరింత ఒత్తిడికి గురి చేసి చర్చల టేబుల్ వద్ద రాజీకి సిద్ధం చేయడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. ఈ ద్వంద్వ వ్యూహం (దాడి + దౌత్యం) మధ్యప్రాచ్య రాజకీయాల సారాంశాన్ని బయటపెడుతోంది. స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమ నియంత్రణ, ప్రాంతీయ స్థిరత్వం ? ఇవన్నీ అమెరికా స్ట్రాటజిక్ లక్ష్యాలు. ఇరాన్ మాత్రం ఆర్థిక ఒత్తిడి, సైనిక నష్టాల నుంచి బయటపడి తన ప్రాంతీయ ప్రభావాన్ని కాపాడుకోవాలని చూస్తోంది.ఈ చర్చలు విజయవంతమైతే మధ్యప్రాచ్యంలో కొత్త శాంతి అధ్యాయం మొదలవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు సాఫీగా జరగడం, ఆర్థిక ఉక్కిరిబిక్కిరి తగ్గడం, ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గడం వంటి సానుకూల ఫలితాలు వస్తాయి. కానీ ఒప్పందం కుదరకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగి పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు వైపులా "ఒప్పందం కావాలి" అన్న కోరిక కనిపిస్తోంది. అయితే షరతులు, అణు అంశాలు, సైనిక నియంత్రణ వంటి విషయాల్లో ఇంకా తీవ్ర అసమ్మతి నెలకొని ఉంది.దోహా చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. మధ్యప్రాచ్య శాంతి ఎప్పుడూ సులభం కాదు. బాంబులు పడుతున్నప్పుడే దౌత్యం నడుస్తున్న ఈ ఆటలో ఏ చిన్న తప్పిదం కూడా సమస్యగా మారుతుంది. ఈ సంక్లిష్టతల మధ్య నుంచి నిజమైన శాంతి ఎలా ఉద్భవిస్తుందో చూడాలి.

# ప్రాంతీయ పార్టీల్లో ఆంధ్రానే టాప్

**ఆదాయంలో టీడీపీ ఖర్చులో వైసీపీ**

**న్యూఢిల్లీ, మే 30:**దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు సంబంధించి ఆదాయాల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. 36 ప్రాంతీయ పార్టీలకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం 2023-2024తో పోలిస్తే 51.57 శాతం తగ్గింది. ఆసక్తికరంగా 21 పార్టీలు ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ రిపోర్ట్ ద్వారా ఆసక్తికర విషయాలు తెలిశాయి. 2024-25కు సంబంధించి 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు ఉంటే.. వాటిలో 36 పార్టీలకు సంబంధించి ఆడిట్ వివరాలు వెల్లడించారు.2024-2025లో 36 ప్రాంతీయ పార్టీలకు రూ.1,192 కోట్ల ఆదాయం రాగా.. వీటిలో రూ.1,433 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాంతీ పార్టీలు వచ్చిన ఆదాయం కంటే రూ.241 కోట్లు (20.13%) ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. టీడీపీకి 2024-2025లో రూ.228.31 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిలో రూ.120 కోట్లు రుసుము, చందాల రూపంలో వచ్చాయి.. విరాళాలుగా రై.85.20 కోట్లు.. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రూ.23.02 కోట్లు.. అలాగే మరో రూ.0.05 కోట్లు వచ్చినట్లు తెలిపారు. రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ రూ.219.35 కోట్లతో ఉంది, మూడో స్థానంలో వైసీపీ రూ.140.38కోట్లు, బీఆర్ఎస్ రూ.123.67 కోట్లు, బీజేడీ రూ.110.13 కోట్లు, ఏఐడీఎంకే రూ.86 కోట్లు, జనసేన రూ.64 కోట్లు ఆదాయం వచ్చింది.వైఎస్సార్‌సీపీకి రూ.140.05 కోట్లు విరాళాల రూపంలో, ఐటీ రీఫండ్ రూ.18 లక్షలు, డిపాజిట్లపై వడ్డీగా రూ.14 లక్సలు.. ఇతర మార్గాల్లో రూ.27వేలు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లపై వడ్డీగా రూ.107.96 కోట్లు, చందాలు- రూ.15.09 కోట్లు, ఐటీ రిఫండ్‌పై వడ్డీగా రూ.13 లక్షలు, ఇతర మార్గాల్లో రూ.48 లక్షల ఆదాయం వచ్చింది. జనసేన పార్టీకి మొత్తం రూ.64 కోట్లలో సభ్యత్వ రుసుం కింద



రూ.59.62 కోట్లు, డిపాజిట్లపై వడ్డీ కింద రూ.4.48 కోట్లు వచ్చాయి. 2023-24లో 36 పార్టీలకు రూ.2,463.17 కోట్ల ఆదాయం వస్తే.. 2024-25లో రూ.1,192.94 కోట్లకు తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఆదాయం రూ.561 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్-రూ.427 కోట్లు, బీజేడీ- రూ.187 కోట్లు, ఆర్జేడీ- రూ.72 కోట్లు, టీడీపీకి- రూ.56 కోట్లు, వైఎస్సార్‌సీపీకి-రూ.50 కోట్ల మేర తగ్గింది.ఆసక్తికరంగా అన్నా డీఎంకేకు ఆదాయం రూ.39 కోట్లు, ఎంఎన్ఎస్-రూ.37 కోట్లు, జనసేన- రూ.24 కోట్లు, జేఎంఎం-రూ.21 కోట్లు, జేడీయూ- రూ.16 కోట్లు, సీపీఐ ఆదాయం రూ.10 కోట్ల మేర పెరిగింది. వైఎస్సార్‌సీపీ 2024-2025లో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు, బీజేడీ రూ.288 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ.227 కోట్లు, బీఆర్ఎస్ రూ.180 కోట్లు, సమాజ్‌వాదీ రూ.74 కోట్లు, టీడీపీ రూ.61.33 కోట్లు, జనసేన పార్టీ రూ.56.94 కోట్లు ఖర్చు చేశాయి. ఓవరాల్‌గా ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో టీడీపీ రూ.228 కోట్లు, ఖర్చులో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు తొలి స్థానాల్లో నిలిచాయి.

**మేళ్ల డబ్బులేనా...**

వైసీపీకి ఆదాయం 140 కోట్లు ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో ఖర్చుపెట్టడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఏకంగా 340.20 కోట్లు ఖర్చు ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆదాయానికి మించి చేసిన ఖర్చును.. ఎలా భర్తీ చేస్తారని.. ఇది ఎలా సాధ్యమవుతుందని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని తక్కువ చేసి చూపించారా.. చేసిన ఖర్చును ఎక్కువ చేసి చూపించారా.. ఖర్చుకు.. వచ్చిన ఆదాయానికి లంకె కుదరకపోవడం ఏంటని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.అధికారంలో ఉన్నప్పుడు వైసిపికి భారీగా విరాళాలు వచ్చాయి. ఇందులో కొన్ని కాంట్రాక్టు సంస్థలు భారీగా ఆ పార్టీకి విరాళాలు సమర్పించాయని తెలుస్తోంది. వచ్చిన వాటిల్లో కొన్ని విరాళాలు మాత్రమే వైసిపి చూపించిందని.. మిగతా వాటిని దాచిందని టిడిపి నేతలు అంటున్నారు. పైగా ఖర్చు విషయంలో కూడా వైసిపి చెప్పిన సమాచారానికి పొంతనలేదని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. తమ పార్టీ దేశంలోనే రిచెస్ట్ రీజినల్ పార్టీగా నిలిచిందని వారు చెబుతున్నారు. 228.31 కోట్ల ఆదాయం ఉన్నప్పటికీ.. ఖర్చు కూడా దానికి తగ్గట్టుగానే ఉందని.. ఆదాయానికి మించిన ఖర్చు తాము చేయలేదని.. కానీ వైసీపీకి ఇది ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు.వైసిపికి ఈ స్థాయిలో ఆదాయం వచ్చి.. ఖర్చు అంతకు మించిన స్థాయిలో ఉన్నప్పటికీ.. దీనికి సంబంధించిన ఒక వార్తను కూడా ఆ పార్టీ మీడియా విభాగం పబ్లిష్ చేయలేదని.. దీనినిబట్టి ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఆర్థిక వ్యవహారాలకు పాల్పడే వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధికారంలో ఉన్నప్పుడు ఏ స్థాయిలో దోచుకుని ఉంటారో అర్థం చేసుకోవచ్చని టిడిపి నేతలు వివరిస్తున్నారు. బహుశా దేశంలో ఇటువంటి ఆర్థిక వ్యవహారాలకు పాల్పడే రీజినల్ పార్టీలలో వైసిపి ప్రథమ స్థానంలో ఉంటుందని.. ఆ పార్టీ రికార్డును ఏ పార్టీ కూడా చెరిపి వేయలేదని టిడిపి నేతలు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు.

# రాజకీయాల్లో నయా ట్రెండ్..

## తమిళనాడు వర్సెస్ కర్ణాటక...

**బెంగళూరు, మే 30:**రాజకీయ నాయకులు అంటే తెల్లటి కుర్తా, రబ్బరు చెప్పులు, నిరాండబరత.. దశాబ్దాలుగా 'సామాన్యుడు' అనే ముసుగులో ఎంతో జాగ్రత్తగా వీటిని కాపాడుకుంటూ వచ్చారు. ఒకవేళ విలాసవంతమైన జీవితం ఉన్నా, అది కేవలం మూసిన తలుపులు దాటి ఇవతలికి వచ్చేది కాదు. కానీ, ఇప్పుడు కాలంతో పాటు రోజులు, రాజకీయాలు కూడా మారాయి. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో దళపతి నటుడు జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే సంచలనం సృష్టించి అతిపెద్ద పార్టీగా నిలిచింది. ముఖ్యమంత్రి అయిన ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 624 కోట్ల ఆస్తి, రూ. 13 కోట్లకు పైగా విలువైన విలాసవంతమైన కార్లు, బ్యాంకు ఖాతాల్లో వందల కోట్ల నగదు ఉన్నట్టు పేర్కొన్నారు.ఇప్పుడు, తమిళనాడు పొరుగున ఉన్న కర్ణాటకలో సిద్ధరామయ్య రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ట్రబుల్ షూటర్ పగ్గాలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. రాజకీయాల్లో నిశ్శబ్ద సంపదకు విజయ్ ప్రతీక అయితే, శివకుమార్ అందుకు పూర్తిగా భిన్నం. ఆయన బహిరంగ విలాసానికి బ్రాండ్ అంబాసిడర్. తాను నిరాండరమైన నేతనని డీకే ఎప్పుడూ చెప్పుకోలేదు. ఖరీదైన లగ్జరీ వాచీలు, డిజైనర్ స్కార్ఫ్‌లను బహిరంగంగా ధరిస్తారు. తన విలాసవంతమైన అభిరుచులపై తరుచూ విమర్శలకు గురైనా ఆయన క్షమాపణలు చెప్పరు. గతంలో ఆయన ధరించిన రోలెక్స్, కార్టియర్ వాచీలపై విమర్శలు రాగా.. "నాకు నచ్చిన ధరించే హక్కు లేదా?" అని ఘాటుగానే సమాధానం ఇచ్చారు. ఈ ఒక్క మాట ప్రస్తుతం రాజకీయాల్లో వస్తోన్న మార్పును స్పష్టం చేస్తోంది. నేటితరం ముఖ్యమంత్రులు ఇకపై తమ సంపదను దాచుకోవాలనుకోవడం లేదు, కొందరు దాన్ని ప్రదర్శిస్తున్నారు.

**డీకే ఓ 'బ్రాండ్'**

డీకే శివకుమార్ విలాసవంతమైన శైలి ఆయన రాజకీయ గుర్తింపులో ఒక భాగమైపోయింది. గూచీ స్కార్ఫ్‌లు, లూయిస్ విట్టన్ స్టోల్స్, ఫెర్రాగామో ర్యాప్స్, కార్టియర్, రోలెక్స్ డేటోనా




వాచీలు ఆయన పబ్లిక్ అప్పీరియన్స్ చూస్తే ఒక సాంప్రదాయ రాజకీయ రోడ్‌షో కంటే ఒక విలాసవంతమైన క్యాటలాగ్‌లా కనిపిస్తాయి. ఆయన ధరించేవాటిలో సుమారు రూ. 54,000 విలువైన గూచీ జాక్వర్డ్ ఉన్ని స్కార్ఫ్, రూ. 1 లక్షకు పైగా ఉన్న లూయిస్ విట్టన్ రేక్‌జావిక్ స్కార్ఫ్, రూ. 15 లక్షల నుంచి రూ. 1.4 కోట్ల మధ్య ఖరీదు చేసే రోలెక్స్ కాస్మోగ్రాఫ్ డేటోనా వాచీలు ఉన్నాయి. ఈ విలాసవంతమైన జీవనశైలిని రాజకీయ ప్రత్యర్థులు ఎంతగా విమర్శలు గుప్పించినా శివకుమార్ మాత్రం వెనక్కి తగ్గలేదు.2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. శివకుమార్ తన ఆస్తుల విలువ రూ. 1,413.80 కోట్లు అని ప్రకటించారు. ఇందులో రూ. 1,140 కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ. 273 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. రూ. 265 కోట్లకుపైగా అప్పులు ఉన్నప్పటికీ, ఆయన దేశంలోని అత్యంత ధనిక రాజకీయ నాయకులలో ఒకరిగా నిలిచారు. రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, క్వారీయింగ్, విద్యారంగం వంటి పలు వ్యాపారాల వల్ల ఇంత సంపద వచ్చింది.తన కుటుంబానికి అనుబంధంగా ఉన్న ట్రస్టుల ద్వారా కర్ణాటక వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలు, ఫార్మసీ సంస్థలు, పబ్లిక్ స్కూళ్లు, మేనేజ్‌మెంట్ సంస్థలతో కూడిన ఒక పెద్ద విద్యా వ్యవస్థను కూడా నడుపుతున్నారు. రాజకీయాలకు అతీతంగా, భారత మొట్టమొదటి ఏఐ-ఆధారిత టౌన్‌షిప్‌గా ప్రచారం జరుగుతోన్న బిడదిలోని గ్రేటర్ బెంగళూరు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ వెనుక శివకుమార్ ఒక కీలక శక్తి.

**విజయ్ నిశ్శబ్ద పెట్టుబడులు**

అయితే శివకుమార్‌తో పోల్చితే విజయ్ సంపద కథ భిన్నంగా ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తన వద్ద అపారమైన సంపద ఉన్నప్పటికీ డబ్బు విషయంలో చాలా సాంప్రదాయబద్ధంగా సురక్షిత మార్గాలనే ఎంచుకుంటారు. అతని ఎన్నికల అఫిడవిట్ ఒక సెలబ్రిటీ పోర్ట్‌ఫోలియోలా కాకుండా, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చే పాతకాలపు వ్యాపారవేత్త బ్యాలెన్స్ షీట్‌లా ఉంది.ఆయన ప్రకటించిన రూ. 624 కోట్ల నికర ఆస్తిలో.. రూ. 313 కోట్లకుపైగా కేవలం బ్యాంకు డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలలోనే ఉన్నాయి. ముఖ్యంగా రూ. 213 కోట్లు ఒకే సేవింగ్స్ ఖాతాలో ఉంచడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్లు, ఈక్విటీ పెట్టుబడులు చాలా తక్కువ. ఆయన నికర ఆస్తిలో వీటి వాటా 0.04 శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. అలాగే, విజయ్‌కు రియల్ ఎస్టేట్‌పై నమ్మకం ఎక్కువే. సుమారు రూ. 220 కోట్ల విలువైన భూములు ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో, నీలన్‌కరై, సాలిగ్రామం, మైలాపూర్, షోలింగనల్లూర్‌లోని ఆస్తులతో సహా తమిళనాడు అంతటా విస్తరించి ఉన్నాయి.ఆయన గ్యారేజీలో బీఎండబ్ల్యూ ఐ7, లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్, ఇంకా ప్రత్యేకంగా తయారు చేయించిన టాటా కారవాన్ వంటివి ఉన్నాయి. ఇది లగ్జరీ కానీ అవసరానికి ఉపయోగపడే విలాసం. కాబట్టి, ఒక నేత తన సంపదను ఆర్భాటంగా ప్రదర్శిస్తే, మరొకరు దానిని నిశ్శబ్దంగా దాచుకుంటారు. కానీ ఇద్దరూ ఒకే పెద్ద మార్పుకు సంకేతాలు ఇస్తున్నారు.భారత రాజకీయ వర్గం మారుతోంది. కొత్త తరం శక్తివంతమైన రాజకీయ నాయకుడు ఇకపై పొదుపు పాటించాల్సిన అవసరం లేదని భావిస్తున్నాడు. విలాసవంతమైన బ్రాండ్లు రాజకీయ ప్రతిబింబంలోకి ప్రవేశిస్తున్నాయి. ఒకప్పుడు రాజకీయ నాయకుడు రోలెక్స్ ధరిస్తే ప్రజలు ఆగ్రహించేవారు. కానీ, ఇప్పుడు వారి వ్యక్తిగత జీవితంలో భాగమైపోయింది.

# జూన్ 2 నుంచి యమునా పుష్కరాలు

**లక్నో, మే 30:**హిందూ సంప్రదాయంలో పుష్కరాలకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. దేవగురువు బృహస్పతి ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశించినప్పుడు, ఆ రాశికి అనుసంధానమైన పవిత్ర నదికి పుష్కర మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ పుష్కరాలు వస్తాయి. గురుడు కర్కాటక రాశిలో ప్రవేశించే సందర్భంగా యమునా నది పుష్కరాలు నిర్వహించబడతాయి. ఈ పవిత్ర కాలంలో లక్షలాది మంది భక్తులు యమునా తీరాలకు చేరుకుని స్నానాలు, పూజలు, దానధర్మాలు నిర్వహిస్తారు.పుష్కరాల్లో తొలి 12 రోజులను ఆది పుష్కరాలు, చివరి 12 రోజులను అంత్య పుష్కరాలు అని పిలుస్తారు. ఈ సమయంలో యమునా నదిలో స్నానం చేయడం ద్వారా పాప విమోచనం కలుగుతుందని, పితృదోషాలు తొలగుతాయని పురాణ విశ్వాసం.

యమునా పుష్కరాలు 2026 తేదీలు

2026 సంవత్సరంలో యమునా పుష్కరాలు జూన్ 2, మంగళవారం ప్రారంభమై జూన్ 13, శనివారంతో ముగుస్తాయి.యమునా పుష్కరాల ప్రధాన ఘాట్లు మధురలో ప్రముఖ ఘాట్లు శ్రీకృష్ణ జన్మభూమిగా ప్రసిద్ధి చెందిన మధురలో భక్తులు సందర్శించదగిన ఘాట్లు: బెంగాలీ ఘాట్, విశ్రాంత్ ఘాట్, స్వామి ఘాట్, కంస ఘాట్, చక్రతీర్థ ఘాట్ బృందావనంలోని పుష్కర ఘాట్లు.. కేశీ ఘాట్, చీర ఘాట్, కాలీయ ఘాట్, ఇమ్లీ తాలా ఘాట్ ప్రయాగరాజ్



ప్రాంతంలో.. త్రివేణి సంగమం, సరస్వతీ ఘాట్, అరైల్ ఘాట్ ఢిల్లీలో.. నిగంబోధ్ ఘాట్, వజీరాబాద్ ఘాట్ అలాగే యమునోత్రి, ఆగ్రా ప్రాంతాల్లో కూడా పుష్కర స్నానాలు నిర్వహిస్తారు. పుష్కరాల్లో చేయదగిన పుణ్యకార్యాలు యమునా పుష్కరాల సమయంలో భక్తులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా పుష్కర స్నానం, పితృ తర్పణాలు, పింద ప్రదానాలు, దానధర్మాలు, దీపదానం, యమునా హారతి, గాయత్రీ మంత్ర జపం, గోపూజ.. ఇవన్నీ ఆధ్యాత్మిక శాంతి, పుణ్యఫలాలను అందిస్తాయని విశ్వసిస్తారు.

**పుష్కరాల్లో 12 రోజుల దానాల విశిష్టత**

**మొదటి రోజు:** ధనం, ధాన్యాలు, భూమి, బంగారం, వెండి దానం చేయడం శుభప్రదం.

**రెండో రోజు:** వస్త్రదానం, రక్తదానం, ఉప్పు దానం చేయడం మంచిదిగా భావిస్తారు.

**మూడో రోజు:** పూలు, బెల్లం దానం చేయడం ద్వారా శుభఫలాలు లభిస్తాయని నమ్మకం.

**నాలుగో రోజు:** నువ్వులు, నెయ్యి, పాలు, తేనె దానం చేయడం శ్రేయస్కరం.

**ఐదో రోజు:** ధాన్యదానం, ఎద్దుల దానం వంటి సేవాకార్యాలు చేయడం మంచిది.

**ఆరవ రోజు:** చందనం, కస్తూరి, ఔషధ దానాలు చేయడం శుభప్రదం.

**ఏడో రోజు:** పీటలు, మంచాలు, గృహ అవసర వస్తువులు దానం చేయడం ఉత్తమం.

**ఎనిమిదో రోజు:** చందనం, కందమూలాలు, పుష్పమాలలు దానం చేయవచ్చు.

**తొమ్మిదో రోజు:** పిండదానం, కంబళి దానం వంటి కార్యక్రమాలు చేయడం మంచిదిగా చెబుతారు.

**పదో రోజు:** కూరగాయలు, పండ్లు వంటి ఆహార పదార్థాలను దానం చేయడం శ్రేయస్కరం.

**పదకొండో రోజు:** గజదానం విశేష పుణ్యఫలితాలను ఇస్తుందని పురాణాలు పేర్కొంటాయి.

**పన్నెండో రోజు:** నువ్వుల దానం చేయడం ద్వారా ప్రత్యేక ఫలితాలు లభిస్తాయని విశ్వాసం.

# డ్రగ్స్ బారిన యువత..
# గ్రామాల భవిష్యత్తుపై ముప్పు

## పౌర హక్కుల సభలో సర్పంచ్ ఆందోళన
### అంబేద్కర్ ఆశయాలతో సామాజిక సమానత్వానికి పిలుపు

**గీసుకొండ, మే 30 అక్షర సవాల్:** పౌర హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం, యువత భవిష్యత్తే లక్ష్యంగా గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సభ ఘనంగా జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నూతన సర్పంచ్ బోడకుంట్ల మానస ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, యువత సంక్షేమంపై వక్తలు విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఐ సాంబయ్య, ఎంఆర్పీఎస్–టీఎస్ రాష్ట్ర నాయకుడు, వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి, ఉపసర్పంచ్ ఆలేటి అనూష పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడకుంట్ల మానస ప్రకాష్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన "బోధించు.. సమీకరించు.. పోరాడు" అనే సందేశం నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గ్రామాల్లో పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్, గుడుంబా వంటి మత్తు పదార్థాల ప్రభావంతో 17 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత దారి తప్పుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. యువతను చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఉపసర్పంచ్ ఆలేటి అనూష మాట్లాడుతూ, సమాన అవకాశాల కల్పనలో రిజర్వేషన్ల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. విద్య ద్వారా చైతన్యం, ప్రశ్నించే తత్వం పెరుగుతుందని, నేడు అనేక మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు రిజర్వేషన్ల ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని తెలిపారు. దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి మాట్లాడుతూ, పౌర హక్కుల అవగాహన కార్యక్రమాలు కేవలం ఎస్సీ, ఎస్టీ కాలనీలకే పరిమితం కాకుండా ప్రజలందరికీ చేరేలా ప్రధాన కూడళ్లలో కూడా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. కుల, వర్గ భేదాలను పక్కనబెట్టి గ్రామాభివృద్ధి




కోసం అందరూ కలిసి పనిచేస్తే మచ్చాపూర్ ఆదర్శ గ్రామంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమం అనంతరం సర్పంచ్ బోడకుంట్ల మానస ప్రకాష్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషణపై ఆరా తీశారు. పిల్లల సంక్షేమం, విద్యా అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు తమ పాలనలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# మహిళా సంఘాలకు శాశ్వత వేదిక
### రూ.10 లక్షల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి శంకుస్థాపన



**గీసుగొండ, అక్షర సవాల్:** గంగదేవిపల్లి గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు శాశ్వత వేదిక కల్పించే దిశగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ భవనం మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడనుంది. మహిళల సాధికారతకు ఈ భవనం మరింత దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగదేవిపల్లి గ్రామ సర్పంచ్ కూసం స్వరూప--రమేష్, ఉపసర్పంచ్ మెడిద ప్రశాంత్, సీఏ పెండ్లి జనార్ధన్, వీఓ అధ్యక్షురాలు నాగిరెడ్డి లావణ్య, గ్రామ పెద్దలు కూసం లింగయ్య, సల్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు, గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం నిర్మాణం గ్రామాభివృద్ధికి దోహదపడే నిర్ణయమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతో గంగదేవిపల్లి గ్రామం మరింత అభివృద్ధి సాధించాలని నాయకులు ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీల్లో చేరితేనే చిన్నారుల సమగ్ర వికాసం
### 'అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట' ర్యాలీలో అవగాహన కల్పించిన అధికారులు



**ఆత్మకూరు, మే 30:** మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి సమగ్ర వికాసానికి బాటలు వేయాలని తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు అందుతున్నాయని తెలిపారు. తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాదిగా నిలుస్తున్నాయని అన్నారు. ఎంఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి బాలబాలికను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ధ్రువపత్రాలు, పాఠశాల యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, ఉపసర్పంచ్ బయ్య పైడి, వార్డు సభ్యులు కుమారస్వామి, రవి, సందీప్, కార్యదర్శి శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు పెరుమాండ్ల దేవమ్మ, పుష్పనీల, పద్మ, కరుణ, వాణి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# గీసుగొండ పోలీసుల వలలో
# 33 కేసుల నేర చరిత్ర కలిగిన అంతర్‌జిల్లా దొంగలు

### పది రోజులుగా వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్
### రూ.35 వేల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
### పోలీసుల చాకచక్యానికి ప్రశంసలు

**గీసుగొండ, అక్షర సవాల్:** గీసుగొండ మండలంలో ఇటీవల వరుస దొంగతనాలతో రైతులు, గ్రామస్తుల్లో ఆందోళన కలిగించిన అంతర్‌జిల్లా నేరస్తుల జంటను గీసుగొండ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. మొత్తం 33 దొంగతన కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.35 వేల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కోనాయమాకుల ఎస్ఆర్ఎస్పీ కెనాల్ సమీపంలో గీసుగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, గీసుగొండ మండలంలోని రాంపూర్, ఎలుకుర్తి, శాయంపేట, గొర్రెకుంట గ్రామాల పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులు, ఎస్ఆర్ఎస్పీ కెనాల్ వద్ద ఉన్న పంపు మోటర్లు, ఇనుప సామగ్రి తదితర వస్తువులను గత పది రోజులుగా చోరీ చేసినట్లు అంగీకరించారు. అరెస్టయిన నిందితులను కరీంనగర్‌కు చెందిన సూర రవి, మహబూబాబాద్‌కు చెందిన ఎం.డి. ఇమ్రాన్ అలియాస్ ఇమామ్‌గా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్, రెండు 3 హెచ్‌పి మోటర్లు, రూ.9 వేల నగదు, ఒక మోటార్ వాల్వ్, ఎనిమిది సెంట్రింగ్ ఐరన్ పైపులు, రెండు బకెట్లు, రెండు ఐరన్ రాడ్లు, రెండు రాతెండు బిందెలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ప్రధాన నిందితుడు సూర రవిపై కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో 24 దొంగతన కేసులు నమోదై ఉన్నట్లు




వెల్లడైంది. మరో నిందితుడు ఇమ్రాన్‌పై వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో 9 దొంగతన కేసులు నమోదై ఉన్నాయి. ఇద్దరిపై సస్పెక్ట్ షీట్లు కూడా కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. వరుస చోరీల కేసులను వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న గీసుగొండ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు మరింత అప్రమత్తంగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## మహిళా సంఘాలకు సొంత భవనాలు..
# అంగన్వాడి కేంద్రాలకూ కొత్త ఊపు
### పలు గ్రామాల్లో రూ.54 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన





**నల్లబెల్లి, మే 30 అక్షర సవాల్:** మహిళా సాధికారత, చిన్నారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నల్లబెల్లి మండలంలోని పలు గ్రామాల్లో నూతన గ్రామ సమైక్య భవనాలు, అంగన్వాడి కేంద్ర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు రూ.54 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పొదుపు సంఘాల బలోపేతానికి గ్రామ స్థాయిలో సమైక్య భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నేటి బాలలే రేపటి పౌరులనే భావనతో అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన అంగన్వాడి భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేలకుంట గ్రామంలోని కాకతీయ, శ్రీచైతన్య గ్రామైక్య మహిళా సంఘ భవనానికి రూ.10 లక్షలు, ముచ్చింపుల గ్రామ సమైక్య భవనానికి రూ.10 లక్షలు, బొలొన్‌పల్లి గ్రామ సమైక్య భవనానికి రూ.12 లక్షలు, కొండాపూర్ గ్రామ సమైక్య భవనానికి రూ.10 లక్షలు, బుచ్చిరెడ్డిపల్లె అంగన్వాడి కేంద్ర నూతన భవనానికి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మంజూరైన పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోత్ రమేష్, జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బత్తిని మహేష్, అఖిల్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామరస్యంతో సాధించిన విజయం..
# ఏళ్ల నాటి సమస్యకు చెక్
### సర్పంచ్ రాజ్‌కుమార్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ముస్లిం సోదరుల సహకారం

**గీసుకొండ, మే 30 అక్షర సవాల్:** గీసుకొండ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సమస్యకు ఎట్టకేలకు తెరపడింది. గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ చొరవ, ముస్లిం సోదరుల సహకారంతో గాంధీ సెంటర్ వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామంలోని గాంధీ సెంటర్ వద్ద ముస్లిం సోదరులు పీరీలు ఏర్పాటు చేసే స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈ అంశం ఎన్నో ఏళ్లుగా వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయింది. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. అయితే గ్రామాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకున్న సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ ముస్లిం పెద్దలతో చర్చలు జరిపి సమస్య తీవ్రతను వివరించారు. గ్రామ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముస్లిం సోదరులు సానుకూలంగా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన స్థలం ఇవ్వడానికి ఏకగ్రీవంగా అంగీకరించారు. దీంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ రాజ్‌కుమార్ చొరవను అభినందిస్తూ, అభివృద్ధి కోసం అన్ని వర్గాలను కలుపుకుపోయే నాయకత్వానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు చూపిన సహకారం గ్రామంలో సామరస్యం,



సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ ఉపసర్పంచ్ కోట ప్రమోద్, మాజీ సర్పంచ్ కోలా కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ పొగాకు బిక్షపతి, సొసైటీ డైరెక్టర్ దౌడు సునీల్, మసీదు పెద్దలు మహమ్మద్ జావిద్ పాషా, మహమ్మద్ ఖలీల్ భాష, పొగాకు కుమారస్వామి, రామ కుమారస్వామి, ధోనికెల నవీన్, వీరగోని పరుశరాములు, ధోనికెల రాములు, రాగిరి రాజేందర్, వీరగోని రామ్మూర్తి, వీరగోని కిరణ్, పాకనాటి సురేష్, జన్నపరెడ్డి మోహన్ రెడ్డి, ఇనుముల ప్రభాకర్, దిడ్డి కుమారస్వామి, దౌడు కుమారస్వామి, కోట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో బదిలీలు....

### అడిషనల్ కమిషనర్ గా జోనా

**వరంగల్ , మే 30, అక్షర సవాల్ :** తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అధికారుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి సంతకంతో వెలువడిన ఉత్తర్వుల ప్రకారం వరంగల్ మహానగరపాలక సంస్థలో పరిపాలనాపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

**వరంగల్ మహానగరపాలక సంస్థలో ఉన్నతాధికారుల బదిలీలు:**



ప్రస్తుతం మెప్మా పీడీగా పనిచేస్తున్న ఇస్సాంపల్లి జోనా ను వరంగల్ మహానగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్గా నియమించారు. వరంగల్ బల్దియాలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ ను నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అనిల్ ను వరంగల్ బల్దియా సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని, బదిలీ అయిన అధికారులు వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రభుత్వ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పొరిక ప్రేమ్ చంద్ కు నివాళులు





**హన్మకొండ, అక్షర సవాల్ :** హనుమకొండ నగరం పోచమ్మకుంటకు చెందిన రిటైర్డ్ హిందీ పండిట్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ పొరిక ప్రేమ్ చంద్ మృతదేహానికి బంధుమిత్రులు, ముఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్.నాయక్, జవహర్ లాల్ నాయక్, డి.ఎస్.పి కరంచంద్, పోరిక రవినాథ్, రవీందర్ నాయక్, లావుడియా రాజు నాయక్, సర్పంచ్ అమృత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనురాగం, ఆప్యాయత, మంచితనానికి మారుపేరుగా నిలిచిన ప్రేమ్ చంద్ గారి మరణం తీరని లోటు. మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడూ ఉంటాయి. పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాం అని బంధుమిత్రులు అన్నారు.

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్స్ బుక్స్ దర్సలు

**హైదరాబాద్, మే 30:**2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కి

తగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్లో, బైండింగ్లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023-24 అకడమిక్ ఇయర్ లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా.. 2025-26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్ట్స్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది. అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్ట్స్ బుక్ ధర గతంలో రూ.225 ఉ ందగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార-గతేడాది ఎల్1 గా నిలిచిన అర్బుర్డ్ సంస్థ పేజీకి 54 పైస చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేబి ప్రకటించి.. ఎల్-1గా నిలిచాయి.

## ఆపరేషన్ సిందూర్ 2.0'కు అంతా సిద్ధం

**ఆర్మీ చీఫ్**

**న్యూ ఢిల్లీ మే 30 :** త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ ద్వివేది వెల్లడించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (చీణూ) పాసింగ్ ఔట్ పరేడ్లో యుద్ధ సన్నద్ధతపై మాట్లాడారు. మానవ రహిత రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసినట్లు తెలిపారు. కాగా అశ్నీ డ్రోన్ ప్లటూన్స్, దివ్యాస్త్ర బ్యాటరీస్తో పనిచేసే ఆర్టిలరీ, శక్తిబాన్ రెజిమెంట్స్, శౌర్య స్క్వాడ్రన్స్ వంటి అన్‌ఆర్మ్ సిస్టమ్స్ రివ్యూకు సిద్ధంగా ఉన్నాయి.

## రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం

**న్యూ ఢిల్లీ మే 30 :**రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు, బికనేర్ ప్రాంతాలను ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. సునామీ తరహాలో భారీ ఈదురు గాలులతో నివాస ప్రాంతాలను ఇసుక ముంచెత్తింది. ఇసుక తుపానుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుపాను ధాటికి పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది.రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఆకాశాన్ని భారీ ధూళి మేఘాలు కమ్మేయడంతో పట్టపగలే రాత్రిని తలపించింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భయంకరమైన ఇసుక తుఫాను విరుచుకుపడింది. సుడిగాలిలా చెలరేగిన భారీ ధూళి మేఘాలు ఆకాశాన్ని పూర్తిగా కప్పేశాయి. విపరీతమైన వేగంతో గాలులు వీయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై కొద్ది మీటర్ల దూరం కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనాలు హెడ్‌లైట్ల సాయంతో మెల్లగా కదిలాయి.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ

**హైదరాబాద్:**తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన G.O.Rt.No.679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది.జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది.తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

**చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత**

**హైద్రాబాద్ (ఉప్పల్ )మే 30:**సరస్వతి పుష్కరాల కోసం వెళ్లే భక్తులకు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత తెలిపారు. కాళేశ్వరం, పుష్కరఘాట్, భద్రకాళి ఆలయం వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. రేపు ఉదయం 7:00 గంటల నుంచి సర్వీసులు ఉంటాయని తెలిపారు.ఏవేని కాలనీ వాసులు 20,30 పుష్కరాలకు వెళుతామని తెలిపితే వారికోసం ప్రత్యేక బస్సు ను పైన్స్ పేర్కొన్న ఛార్జీలకే ఏర్పాటు చేయనున్నట్లు కవిత వివరించారు.మరిన్ని వివరాలకు 9110505820, 9948886516 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు, యోగా దోహదం...

**జీడబ్ల్యూఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు**

**విజేతలకు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్**











**వరంగల్, మే 30 (అక్షర సవాల్ ):** విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి క్రీడలు, యోగా ఎంతో దోహదపడతాయని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావన పెంపొందుతాయని ఆమె తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మే 1 నుండి నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

**విద్యార్థులతో ఆత్మీయంగా మమేకం**

ముగింపు కార్యక్రమంలో భాగంగా క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జూడో, యోగా తదితర క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించడమే కాకుండా, కొన్ని క్రీడా కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు కలెక్టర్ స్వయంగా ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. విజేతలు కలెక్టర్‌తో ఫొటోలు దిగి సంతోషం వ్యక్తం చేశారు.

**క్రీడాస్ఫూర్తే విజయానికి పునాది**

ముగింపు సభలో మాట్లాడిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, "విద్యతో పాటు క్రీడలు, యోగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరం. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ నెల రోజుల సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జూడో, యోగా వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయం" అని అన్నారు. "వేసవి సెలవులను కేవలం విశ్రాంతికి మాత్రమే వాడకుండా, క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పిల్లలు తమలోని ప్రతిభను వెలికి తీస్తారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి పునాది వేస్తుంది" అని ఆమె విద్యార్థులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్, విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారి సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చేందుకు చక్కటి వేదికగా నిలిచిందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

**విద్యార్థుల్లో ఉత్సాహం**

నెల రోజుల పాటు జరిగిన ఈ కోచింగ్ క్యాంప్‌లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడల్లో శిక్షణ పొందారు. కోచ్‌ల మార్గదర్శనంలో ప్రాథమిక నైపుణ్యాల నుండి పోటీ స్థాయి వరకు శిక్షణ పొందిన విద్యార్థులు, ముగింపు ప్రదర్శనల్లో తమ ప్రతిభను చూపి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డా. రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, డీఎఫ్ఓ శంకర్ లింగం ఎస్ఎఫ్ఓ రాజేశ్వర్ రావు తదితర అధికారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేసవిని ఉపయోగకరంగా మార్చుకున్న ఈ క్యాంప్, వరంగల్‌లో విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించే దిశగా ఒక మంచి అడుగుగా నిలిచింది.

# కోటి మహిళలు కోటీశ్వరులే లక్ష్యం

**గ్రామీణ మహిళా సాధికారతకు మహిళా సమైక్య భవనాలే బలమైన వేదిక :ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





**గీసుగొండ, మే 30 అక్షర సవాల్:** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి స్వావలంబన సాధించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా శనివారం గీసుగొండ మండలంలోని ఎల్కుర్తి హవేలీ, ఆరేపల్లి, చంద్రయ్యపల్లి, గంగాదేవిపల్లి, కొనయమాకులు, విశ్వనాథపురం, ఊకల్ హవేలీ, మరియాపురం, శాయంపేట గ్రామాల్లో నిర్మించనున్న మహిళా సమైక్య భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళల భాగస్వామ్యంతోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు బ్యాంకు రుణాలపై వడ్డీని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకుల కేటాయింపు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, రైస్ మిల్లులు, మహిళా శక్తి సూపర్ బజార్లు, వి-హబ్ కేంద్రాలు, మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో మహిళా భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరకాల మహిళా డెయిరీ ఏర్పాటు కూడా మహిళలపై ఉన్న పూర్తి నమ్మకానికి నిదర్శనమని, ప్రతి మహిళ అందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించిన ఎమ్మెల్యే, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి మహిళా సమైక్య భవనాలు కీలక కేంద్రాలుగా మారనున్నాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మండే ఎండల్లో మజ్జిగ చలివేంద్రం

**4,500 మందికి దాహ నివారణ సేవ..**

**అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్‌కు ప్రశంసల వెల్లువ**



**గీసుకొండ, మే 30 అక్షర సవాల్:** భానుడు భగ్గుమంటూ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్న వేళ, దాహంతో అలమటిస్తున్న ప్రజలకు చల్లని ఉపశమనం అందించేందుకు అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ చేపట్టిన ఉచిత 'శీతల మజ్జిగ పంపిణీ -- దాహ నివారణ సేవ' కార్యక్రమం విశేష ఆదరణ పొందింది. కొమ్మాల అంగడి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మజ్జిగను స్వీకరించారు. అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా దాదాపు 4,500 మందికి పైగా ఉచితంగా శీతల మజ్జిగ పంపిణీ చేసి ఎండ వేడి నుంచి ఉపశమనం కల్పించారు. ప్రజల అవసరాలను గుర్తించి చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. జిల్లా నాయకులు, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ జరగడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో మమేకమై సేవ చేయాలనే సంకల్పానికి ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, దశ్రుతండ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, మాజీ సర్పంచ్ దౌడు బాబు, నాయకులు మదాసి రాంబాబు, తుప్పరి వికాస్, దౌడు సునీల్, పాకనాటి మధు, బోయ అశోక్, దౌడు రాజేష్, హర్జ్య తండా హరి నాయక్, బాదావత్ లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజ సేవ పట్ల అంకితభావంతో, ప్రజారోగ్య పరిరక్షణకు తోడ్పడే ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభినందించారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్



హైదరాబాద్, మే 30: బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలిస్తున్నారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు: బాల్క సుమన్**

పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

**బాల్క సుమన్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో వివరాలు..**

బాల్క సుమన్‌పై **326(g), 351(3), 353(1)(b), r/w55, r/w 61(2)(a), bns 4 pdppa** కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

# గాదె వెంకటరెడ్డి మృతిపై రేవంత్ సంతాపం

**వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో కన్నుమూసిన గాదె వెంకటరెడ్డి**

**రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు అని కితాబునిచ్చిన రేవంత్**

**రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని వ్యాఖ్య**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాదె వెంకటరెడ్డి రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచారని, ఆయన హయాంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని రేవంత్ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిథ్యం వహించిన ఆయన, మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని సీఎం పేర్కొన్నారు. 1940 జులై 10న ప్రకాశం జిల్లా పావులూరులో జన్మించిన గాదె వెంకటరెడ్డి న్యాయశాస్త్రం అభ్యసించారు. ప్రజాసేవపై ఉన్న ఆసక్తితో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి తన 27వ ఏటనే తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1991 (ఉప ఎన్నిక), 1994లో పర్చూరు నుండి, అలాగే 2004, 2009లలో బాపట్ల నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. ఉమ్మడి ఏపీలో అగ్ర నేతలైన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్యల మంత్రివర్గాల్లో దేవాదాయ శాఖతో పాటు పలు కీలక శాఖల మంత్రిగా ఆయన సమర్థవంతంగా సేవలందించారు. కాంగ్రెస్ తర్వాత ఆయన తెలుగుదేశం పార్టీ, వైసీపీలలో కూడా కొనసాగారు. ఒక విలువలతో కూడిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ముగించి నిష్క్రమించిన గాదె వెంకటరెడ్డి మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా...

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**మోయినాబాద్:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత శనివారం మొయినాబాద్ లో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించారు. కవిత మాట్లాడుతూ మొయినాబాద్, చేవెళ్ల ప్రజలందరికీ నమస్కారం. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చాం. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పోతాయనుకుంటే అది జరగలేదు. ఆ లక్ష్యాలను సాధించుకోని, తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుంది. ఈ ప్రాంతంలో చూస్తే ఎకరాకు వందకోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని అన్నారు. ఐతే 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను ఎత్తివేస్తే ఇక్కడి రైతులకు మేలు జరుగుతుంది. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్న మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ 111 జీవో ఎత్తివేస్తామని అన్ని పార్టీల వారు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవటం లేదు. తెలంగాణ రక్షణ సేన కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. మేము 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారు. ఈ గుంపుమేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని చెప్పాడు. కానీ ఆ వ్యాపారాన్ని కూడా ఊడగొట్టిండు. అందుకే గుంపు మేస్త్రీ పై పోరాటం చేయాల్సి ఉంది. చేవెళ్ల, మొయినాబాద్ ప్రజలు ఈ ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉండాలి. మన పార్టీలోకి పెద్ద ఎత్తున మైనార్టీలు చేరారు. వాళ్ల చేరికతో మరింత బలపడ్డాం. ఇక్కడున్న గంగా, జమునా తెహజీబ్ సంస్కృతిని చెడగొట్టే వాళ్లకు సరైన బుద్ధి చెప్పాలి. తెలంగాణ వస్తే మన ఆడబిడ్డల జీవితాలు మారుతాయని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. ఆడబిడ్డలకు కచ్చితంగా మంచి చేసేందుకు నేను పార్టీ పెట్టాను. ఒక ఆడబిడ్డ, మీ సోదరిగా నాకు మీ సమస్యలన్నీ తెలుసు. మన యువతకు కూడా ఉద్యోగాలు రావాల్సి ఉంది. కచ్చితంగా తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తుంది. అప్పుడు యువతకు అవసరమైన ఉద్యోగాలు కల్పిస్తాం. ఎలాంటి గ్యారంటీ లేకుండా వారికి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని అన్నారు.

# గ్రేటర్‌లో 15 లక్షల రేషన్ కార్డులు..

**సేవల్లో మాత్రం తీవ్ర జాప్యం**




**హైదరాబాద్,మే 30:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పౌరసరఫరాల శాఖ అధికారుల మధ్య సరైన అవగాహన, సమన్వయం కరువవ్వడం ప్రజా పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ప్రాంతంలో సుమారు 15 లక్షలకు పైగా కుటుంబాలకు చెందిన అరకోటి మంది లబ్ధిదారులకు నిత్యావసరాలను సరఫరా చేసే ప్రక్రియలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చీఫ్ రేషనింగ్ అధికారి కార్యాలయంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల విభాగాలు ఈ పంపిణీలో భాగస్వాములుగా ఉన్నాయి. సన్న బియ్యం, ఇతర నిత్యావసరాల సరఫరాతో పాటు కొత్త కార్డుల జారీ, తప్పుల సవరణ వంటి కీలక బాధ్యతలను ఈ విభాగాలు నిర్వహిస్తున్నాయి. అయితే అధికారుల మధ్య సయోధ్య లేకపోవడం వల్ల నిత్యావసరాల అక్రమ రవాణాకు దారితీస్తోందనే విమర్శలు వస్తున్నాయి. దీనితో పాటు రేషన్ కార్డుల మంజూరు, ధ్రువీకరణ ప్రక్రియల్లో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ ద్వారా వచ్చే దరఖాస్తులను అసిస్టెంట్ సప్లై ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా పౌరసరఫరాల అధికారి ద్వారా సీఆర్వో కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయి పరిశీలనలు సకాలంలో పూర్తికాకపోవడంతో కొత్త కార్డుల పంపిణీ నిలిచిపోయింది. ముఖ్యంగా జిల్లాల సరిహద్దుల్లో ఉండే కాలనీల దరఖాస్తులు ఏ అధికారి పరిధిలోకి వస్తాయనే దానిపై స్పష్టత లేకపోవడంతో విచారణలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. ఒక జిల్లాలో పంపిణీ మొదలైనా, పొరుగు జిల్లా పరిధిలోకి వచ్చే ప్రజలకు తమ కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం కోసం ప్రజలు మీసేవ కేంద్రాలు, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. రేషన్ సరుకులు తీసుకోవడానికి కొత్త కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల ప్రజలకు ఇంటి పక్కనే రేషన్ షాపు ఉన్నప్పటికీ, వారి కార్డులు వేరే జిల్లా పరిధిలోకి మారడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డుల సంఖ్య పెరిగిన చోట కొత్త దుకాణాలను ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న రేషన్ షాపులపైనే విపరీతమైన రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. సరుకుల అక్రమ రవాణాపై ఎవరికి వారు తమ పరిధిలోని అంశం కాదంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్లు, గ్రీవెన్స్ సెల్స్ ఉన్నప్పటికీ.. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రేషన్ కార్డులు , లబ్ధిదారుల గణాంక వివరాలను పరిశీలిస్తే.. మొత్తం నాలుగు జిల్లాల వ్యాప్తంగా 15,90,438 రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 58,37,087 మంది లబ్ధిదారులు నిత్యావసర సరుకులను పొందుతున్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 8,41,954 కార్డులు, 32,24,963 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో 4,74,855 రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య 16,45,039 గా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా పరిధిలో 2,50,036 కార్డుల ద్వారా 8,83,620 మంది లబ్ధి పొందుతుండగా, అత్యల్పంగా సంగారెడ్డి జిల్లాలో 23,593 రేషన్ కార్డులు, 83,465 మంది లబ్ధిదారులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారితే?



**హైదరాబాద్,మే 30:** హైదరాబాద్ నగరంలో భూమి ధరలు ఆకాశమే హద్దు అన్న చందంగా దూసుకుపోతున్నాయి. రాయదుర్గంలో ఎకరం రూ.237 కోట్లు పలికిందంటే అది కేవలం ప్రభుత్వ ఖజానాకు వచ్చిన ఆదాయం మాత్రమే కాదు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే సగటు మనిషి ఆర్థిక స్థితిపై పడ్డ పెద్ద దెబ్బ. ప్రభుత్వం లాభాపేక్షతో భూములను కార్పొరేట్ సంస్థలకు వేలం వేయడం వల్ల, రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కృత్రిమమైన హైప్ సృష్టికి కారణం అవుతోంది. ఇది అంతిమంగా నిర్మాణ వ్యయం పెరగడానికి, తద్వారా సామాన్యుడికి సొంతింటిని అందని ద్రాక్షగా మార్చడానికి దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం భూములను ప్రజా అవసరాల కోసం స్కూళ్లు, ఆస్పత్రులు, పార్కులు , పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, గత కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఆదాయం కోసం భూములను మానిటైజేషన్ చేయడంపైనే దృష్టి పెట్టింది. రాయదుర్గం, కోకాపేట వంటి ప్రాంతాల్లో రికార్డు ధరలు పలకడం వల్ల పక్కనే ఉన్న గచ్చిబౌలి, నార్సింగి, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా భూమి రేట్లు అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైస్ మార్కెట్‌లో ఒక కొత్త బెంచ్‌మార్క్‌గా మారుతోంది, దీనివల్ల ప్రైవేట్ భూముల ధరలు కూడా నియంత్రణ లేకుండా పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు సామాన్యుడు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిన్న ప్లాటో లేదా ఫ్లాటో కొనుక్కునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ఫ్లాట్ ధర కనీసం రూ.70 లక్షల నుండి రూ.1.5 కోట్ల వరకు పలుకుతోంది. ప్రభుత్వం భూములను వందల కోట్లకు విక్రయించడంతో, బిల్డర్లు ఆ ధరను భర్తీ చేయడానికి విలాసవంతమైన హై-రైజ్ అపార్ట్‌మెంట్‌లనే నిర్మిస్తున్నారు. దీనివల్ల అఫోర్డబుల్ హౌసింగ్ అనే కాన్సెప్ట్ హైదరాబాద్‌లో కనుమరుగైపోతోంది. మధ్యతరగతి ప్రజలు తమ జీవితకాల సంపాదనను ఇఎంఐ ల రూపంలో చెల్లించినా, ఒక చిన్న గూడు దక్కడం కష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ భూముల వేలం విధానంపై రాజకీయ విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, సామాన్యుడిని నగరం వెలుపలికి తరిమేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. భూముల విలువలను పెంచి స్టాంప్ డ్యూటీ ద్వారా అదనపు ఆదాయం పిండుకోవడం వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. ఇది కేవలం ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికే తప్ప, సామాన్యుడి సంక్షేమం కోసం కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. ధరలు ఇలాగే అసహజంగా పెరిగితే భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ బబుల్' ఏర్పడి మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొనుగోలు శక్తికి మించి ధరలు పెరిగితే, ఇన్వెస్టర్లు వెనక్కి తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం కేవలం ఆదాయంపైనే కాకుండా, సామాన్యుల నివాస అవసరాల కోసం ఒక సమగ్ర గృహ నిర్మాణ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. కేవలం ధనవంతులకు, ఐటీ కంపెనీలకే కాకుండా.. నగరంలో పనిచేసే సామాన్య కార్మికులు, ఉద్యోగులకు కూడా గూడు దక్కేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదగడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా, అది సామాన్యుల కన్నీళ్ల మీద పునాదులు వేసుకోకూడదు. ప్రభుత్వం భూములను వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవడం తప్పు కాకపోయినా, ఆ ఆదాయంలో కొంత భాగాన్ని తిరిగి పేద, మధ్యతరగతి గృహ నిర్మాణ పథకాలకు మళ్లించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. హైదరాబాద్ నగరంలో టీజీఐఐసి భూముల వేలం నిర్వహించింది. రాయదుర్గం ప్రాంతంలోని పాన్ మక్తా ఏరియాలోని సర్వేనెంబర్ 83/1 లో ఆరు ఎకరాల 29 గుంటల భూమికి వేలం వేస్తున్నారు.. ఎకరం భూమిని 237 కోట్లకు ఓ కంపెనీ కొనుగోలు చేసింది. ఇంకా ఈ భూమికి సంబంధించి వేలం జరుగుతున్న నేపథ్యంలో భారీగా సొమ్ములు ప్రభుత్వానికి సమకూరే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాది ఇదే ప్రాంతంలో 7.6 ఎకరాలను ప్రభుత్వం వేలం వేసింది. అప్పుడు ఎకరం ధర 177 కోట్లు పలికింది. నాడు ప్రభుత్వానికి ఏకంగా 1357.59 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో ధర పలకడం విశేషం. హైదరాబాద్ నగరంలో పెద్దపెద్ద కంపెనీలు రియల్ ఎస్టేట్ వ్యవహారాలు సాగిస్తున్నాయి. భారీగా భవనాలను నిర్మిస్తున్నాయి. ముఖ్యంగా రాయదుర్గం.. మంచిరేవుల.. నార్సింగి.. కోకాపేట.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్.. నేక్నాం పుర వంటి ఏరియాలలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఎకరం ధర 100 కోట్లలో ఉంది. అందువల్లే ఇక్కడ భారీగా భవనాలను నిర్మించడానికి రియల్ ఎస్టేట్ కంపెనీలు ఆసక్తిని చూపిస్తున్నాయి. ఫార్మా కంపెనీలు.. ఫైనాన్షియల్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు ఇక్కడ శాశ్వత నివాసం ఏర్పరచుకుంటున్నారు. అందువల్లే ఇక్కడ నివాస సముదాయాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఫలితంగా పెద్ద పెద్ద కంపెనీలు ఇక్కడ భూములను కొనుగోలు చేసి భారీ స్థాయిలో భవనాలను నిర్మిస్తున్నాయి. ఇప్పటికే రాజ్ పుష్ప.. అపర్ణ.. మై హోమ్.. జనప్రియ వంటి కంపెనీలు అత్యంత భారీగా నివాస సముదాయాలను నిర్మిస్తున్నాయి. అందువల్లే ఇక్కడ భూములను వందల కోట్లు ఖర్చుపెట్టి కొనుగోలు చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఒక ఎకరం వచ్చేసి 237 కోట్లు పలికిందంటే మామూలు విషయం కాదు. దీంతో యావత్ దేశం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తోంది. కాగా, ధరలు ఈ స్థాయిలో పెరిగితే హైదరాబాదులో సామాన్యులు జాగాలు కొనే పరిస్థితి ఉండదని.. నిపుణులు చెబుతున్నారు.

# పీసీబీలో ఇంటి దొంగలు...




**హైదరాబాద్,మే 30:** రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్న కంప్యూటరైజ్డ్ తనిఖీ విధానంపై తీవ్రమైన అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల్లో ఏ నెలలో తనిఖీలు జరుగుతాయనే సమాచారాన్ని ముందే యాజమాన్యాలకు, అధికారులకు చేరవేయడం వల్ల ఉల్లంఘనదారులకు అది అనుకూలంగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల లోపాలను ముందే సరిదిద్దుకోవడం లేదా అధికారులను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటోందని తెలుస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' రూపొందించిన ఒక ప్రత్యేక టూల్ ద్వారా ఈ కంప్యూటరైజ్డ్ తనిఖీలను పీసీబీ చేపడుతోంది. ఈ విధానంలో ప్రతి నెలా 70 నుండి 120 వరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అందులో దాదాపు 30 వరకు రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లోనే ఉంటున్నాయి. ఏ అధికారి ఎక్కడ తనిఖీ చేయాలో పీసీబీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగం నిర్ణయిస్తుంది. ఈ తనిఖీల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. అయితే, ఈ పద్ధతిని పక్కనపెట్టి ఆకస్మిక తనిఖీలు చేసేలా ఒక పటిష్టమైన ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాల తీవ్రతను బట్టి వాటిని రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీలుగా విభజించి ఈ తనిఖీలు జరపాలి. గతంలో నిబంధనలు పాటించిన రికార్డులను బట్టి తనిఖీలను కేటాయిస్తారు. ఇన్‌స్పెక్టర్లకు ఈ బాధ్యతలను రాండమ్‌గా లేదా రిస్క్ ఆధారంగా టూల్ ద్వారా కేటాయించడం జరుగుతుంది. తనిఖీ పూర్తయిన తర్వాత వాటర్, ఎయిర్ యాక్ట్‌ల ప్రకారం 72 గంటల్లోగా ఇన్స్‌పెక్షన్ రిపోర్టును ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వ్యర్థాల శుద్ధి, వాయు కాలుష్య మూలాలు, నియంత్రణ పరికరాలు, ప్రమాదకర వ్యర్థాల ఉత్పత్తి , వాటి నిల్వ, పారవేత వంటి కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరచాల్సి ఉంటుంది. మరోవైపు, ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగమైన 'జనవాణి'కి ప్రజల నుండి ప్రతి నెలా 50కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయడం, చెత్తను దహనం చేయడం, పరిశ్రమల నుండి వెలువడే ఘాటైన వాసనలు వంటి సమస్యలపై పౌరులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, ఆ నివేదికలను నేరుగా డాష్ బోర్డులో బహిరంగంగా ఉంచితే వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని ప్రజల నుండి డిమాండ్లు వినపిస్తున్నాయి

# సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

**కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కాళేశ్వరం:** సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని ప్రార్థించానని తెలిపారు.

# హోంగార్డుపై దాడి

**అనకాపల్లి:** అనకాపల్లి జిల్లాలో పోలీసులకే రక్షణ కరువు అయింది. లంకెలపాలెంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుపై దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హోంగార్డ్ తల పగలగొట్టారు. హోంగార్డ్ వెంకటరమణ తలకు బలమైన గాయం అయి . తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# రోజూ మామిడి పండును తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయి..?



వేసవి వచ్చిందంటే చాలు చాలామందికి ముందుగా గుర్తుకొచ్చే పండు మామిడిపండు. తీపి రుచి, సువాసనతోపాటు దీన్ని పోషకాల పరంగా కూడా ఎంతో విలువైనదిగా భావిస్తారు. అయితే ప్రతిరోజూ మామిడి తింటే శరీరంలో ఏం మార్పులు జరుగుతాయి? సరైన మోతాదులో తీసుకుంటే ఇది ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడుతుంది? అనే విషయాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. ఒక కప్పు మామిడి ముక్కల్లో సుమారు 99 క్యాలరీలు, 25 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2.6 గ్రాముల ఫైబర్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. అందుకే మామిడి కేవలం తీపి పండు మాత్రమే కాకుండా శరీరానికి ఉపయోగపడే పోషకాల నిల్వగా కూడా చెప్పవచ్చు. అయితే ఇందులో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటంతో మోతాదు నియంత్రణ చాలా ముఖ్యం.

**తక్షణ శక్తి, ఫైబర్ ప్రభావం..**

ప్రతిరోజూ మామిడి తినడం ప్రారంభించిన మొదటి వారంలోనే శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. సహజ కార్బోహైడ్రేట్లు త్వరగా ఎనర్జీ ఇస్తాయి. ఫైబర్ జీర్ణక్రియను కొంత నెమ్మదిగా చేసి ఎక్కువసేపు తృప్తి కలిగిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా మొక్కల ఆధారిత ఆహారాల్లోని ఐరన్‌ను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడుతుంది. ప్యాకెట్ స్నాక్స్ లేదా చక్కెర పానీయాల స్థానంలో మామిడి తీసుకుంటే తేలికైన ఆహారపు అలవాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. రెండో వారానికి వచ్చేసరికి మామిడిలోని ఫైబర్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా ఉంచడంలో సహాయపడుతుంది. నీటి శాతం ఎక్కువగా ఉండటంతో శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అయితే మితిమీరిన మోతాదులో తింటే కొంతమందిలో చక్కెర ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. మూడో వారానికి మామిడిలోని పోషకాల అసలు ప్రయోజనం కనిపించడం ప్రారంభమవుతుంది. విటమిన్ ఎ, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, కణాల రక్షణకు తోడ్పడతాయి. విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ తయారీలో కూడా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా పండ్లు తినని వారి ఆహారంలో మామిడి చేరితే పోషకాల లోటు కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

**వీటిని కలిపి తింటే మంచిది..**

మామిడిని ఒంటరిగా తినడం కంటే ప్రోటీన్ లేదా మంచి కొవ్వు పదార్థాలతో కలిపి తింటే మరింత సమతుల్యమైన ఆహారంగా మారుతుంది. గ్రీక్ యోగర్ట్, డ్రైఫ్రూట్స్, పనీర్, గుడ్లు వంటి వాటితో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా ఉండటానికి సహాయపడుతుంది. అయితే మామిడి అందరికీ సరిపోదు. మామిడిపండు అలర్జీ ఉన్నవారు దీనిని పూర్తిగా దూరంగా ఉంచాలి. పాయిజన్ ఐవీ, ఓక్ వంటి మొక్కలకు అలర్జీ ఉన్నవారిలో మామిడి తొక్క లేదా రసం వల్ల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఐబీఎస్ లేదా ఫాడ్‌మాప్ సెన్సిటివిటీ ఉన్నవారిలో కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు కనిపిస్తాయి. సరైన మోతాదులో ప్రతిరోజూ మామిడి తినడం వల్ల శరీరానికి విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇది జీర్ణక్రియ, తృప్తి భావం, మొత్తం పోషకాహార నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కానీ మోతాదు మించితే ప్రయోజనాల కంటే ఇబ్బందులు ఎక్కువయ్యే అవకాశం కూడా ఉంటుంది.

# రోజూ గంటల తరబడి కంప్యూటర్ కీబోర్డుపై టైప్ చేస్తున్నారా.. అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..



డిజిటల్ యుగంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు లేకుండా రోజువారీ జీవితం ఊహించలేని స్థితికి చేరుకుంది. ఉద్యోగులు, విద్యార్థులు, గేమర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇలా చాలా మంది రోజులో గంటల తరబడి టైపింగ్, స్క్రోలింగ్, క్లికింగ్ చేస్తూ గడుపుతున్నారు. బయటికి చూస్తే డెస్క్ పని శారీరకంగా కష్టమైన పని కాకపోయినా, చేతులు, మణికట్టుపై పడే నిరంతర ఒత్తిడి కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని చెబుతున్నారు. నిరంతరం టైపింగ్ చేయడం, మౌస్ ఉపయోగించడం వల్ల రోజుకు వేల సంఖ్యలో చిన్నచిన్న కదలికలు చేతులు, మణికట్టు, వేళ్లపై ప్రభావం చూపుతాయి. పరిశోధనల ప్రకారం కంప్యూటర్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు గంటకు 18 వేలకుపైగా కీ స్ట్రోక్స్ చేస్తుంటారు. ఈ పునరావృత కదలికలు కండరాలు, టెండన్లు, నరాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తాయి. ముఖ్యంగా మణికట్టును వంచి పనిచేయడం లేదా సరైన సపోర్ట్ లేకుండా టైపింగ్ చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

**ఎలాంటి సమస్యలు వస్తాయి..**

డెస్క్ పనికి సంబంధించిన సాధారణ సమస్యల్లో కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, టెండనైటిస్, ట్రిగ్గర్ ఫింగర్, టెన్నిస్ ఎల్బో, మణికట్టు నొప్పులు, బొటనవేలి ఒత్తిడి గాయాలు, నరాల ఒత్తిడి సమస్యలు ఉన్నాయి. ఇవి మొదట చిన్న అసౌకర్యంలా ప్రారంభమైనా, నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక నొప్పులకు దారితీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యలకు కొన్ని ప్రారంభ సంకేతాలు కూడా ఉంటాయి. వేళ్లలో చిమ్మటలు లేదా మొద్దుబారిన భావన, మణికట్టు నొప్పి, బొటనవేలి అసౌకర్యం, వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవడం, ముందరిచేయిలో మంట, వేళ్లు క్లిక్ అవడం లేదా లాక్ అవడం, టైపింగ్ సమయంలో నొప్పి, రాత్రిళ్లు చేతులు మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. సమస్యను తొందరగా గుర్తిస్తే శాశ్వత నష్టం తప్పించుకోవచ్చు. కానీ లక్షణాలు ఉన్నప్పటికీ అదే విధంగా పని కొనసాగిస్తే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ వంటి నరాల ఒత్తిడి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చేతి బలహీనత, కండరాల క్షీణత, పట్టుదల తగ్గడం, వేళ్ల సమన్వయం కోల్పోవడం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


**ఎర్గోనామిక్ డివైస్‌లను వాడాలి..**

ఇప్పటి వరకు ఈ సమస్యలు ఎక్కువగా వయసు పైబడిన ఉద్యోగుల్లో కనిపించేవి. కానీ ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరుగుతున్నాయి. గంటల తరబడి ల్యాప్‌టాప్ వినియోగం, మొబైల్ స్క్రోలింగ్, వీడియో గేమ్స్, సరైన ఫర్నిచర్ లేకుండా వర్క్ ఫ్రం హోమ్, శారీరక చలనం తగ్గడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఈ సమస్యలను నివారించడంలో సరైన ఎర్గోనామిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. టైపింగ్ సమయంలో మణికట్టును నేరుగా ఉంచడం, కీబోర్డ్, మౌస్‌ను మోచేతి స్థాయిలో ఉంచడం, చేతులకు సపోర్ట్ ఇచ్చే కుర్చీలను ఉపయోగించడం, స్క్రీన్‌ను కళ్ల స్థాయిలో ఉంచడం, నిటారుగా కూర్చోవడం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అవసరమైతే ఎర్గోనామిక్ కీబోర్డులు, ప్రత్యేక మౌస్ పరికరాలు ఉపయోగించడం కూడా ఉపయోగకరమని చెబుతున్నారు. పని మధ్యలో విరామాలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. గంటల తరబడి నిరంతర టైపింగ్ వల్ల కండరాలు, టెండన్లు విశ్రాంతి పొందలేవు. ప్రతి 45 నుంచి 60 నిమిషాలకు చిన్న విరామం తీసుకోవడం, వేళ్లు, మణికట్టుకు స్ట్రెచింగ్ చేయడం, మెడ, భుజాలను కదలించడం, టైపింగ్ సమయంలో అధిక ఒత్తిడి పెట్టకుండా ఉండడం వల్ల సమస్యలను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..**

చేతుల బలహీనత, నిరంతర నొప్పి, నిద్రలో కూడా చేతులు మొద్దుబారడం, విశ్రాంతి తీసుకున్నా సమస్య తగ్గకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అవసరమైతే నర్వ్ స్టడీస్, స్కాన్లు చేసి సమస్య తీవ్రతను గుర్తిస్తారు. చికిత్సలో ఫిజియోథెరపీ, మణికట్టు సపోర్ట్, మందులు, జీవనశైలి మార్పులు, తీవ్రమైన పరిస్థితుల్లో శస్త్రచికిత్స కూడా అవసరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. డెస్క్ పని బయటికి తేలికగా కనిపించినా, దీర్ఘకాలంలో చేతులు, మణికట్టు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. అయితే సరైన భంగిమ, క్రమం తప్పని విరామాలు, వ్యాయామం, సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను చాలా వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వేసవిలో ఫైబర్ అధికంగా తీసుకుంటున్నారా.. అయితే ఈ సమస్యలు వస్తాయి జాగ్రత్త..




వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే ఎక్కువగా సలాడ్లు తినాలని చాలామంది భావిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గడం, శరీరానికి ఫైబర్ అందించడం కోసం ముడి కూరగాయలతో చేసిన సలాడ్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. అయితే తీవ్ర ఎండల్లో అధికంగా ముడి సలాడ్లు తినడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, జీర్ణ సమస్యలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శరీరం వేడికి గురయ్యే వేసవి కాలంలో జీర్ణక్రియ సున్నితంగా మారుతుందని చెబుతున్నారు. ఫైబర్ శరీరానికి అవసరమైన పోషకాల్లో ఒకటి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. కానీ అధికంగా తీసుకుంటే అదే ఫైబర్ కడుపులో ఇబ్బందులకు కారణమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఒక్కసారిగా ఎక్కువ మోతాదులో ముడి సలాడ్లను తినడం వల్ల గ్యాస్, ఉబ్బరం, కడుపు మంట, క్రాంప్స్ వంటి సమస్యలు వస్తాయని అంటున్నారు.

**గ్యాస్ ఇలా ఏర్పడుతుంది..**

వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అలాంటి సమయంలో ముడి కూరగాయల్లో ఉండే అధిక ఫైబర్‌ను జీర్ణం చేయడం పొట్టకు కష్టమవుతుంది. దీంతో ఆ ఫైబర్ జీర్ణాశయం (గట్)లో ఫర్మెంటేషన్‌కు గురై గ్యాస్ ఏర్పడే అవకాశం పెరుగుతుంది. ఫలితంగా కడుపు బిగుసుకుపోయినట్టు అనిపించడం, ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు ఎక్కువవుతాయి. నిపుణుల ప్రకారం ముడి సలాడ్లు అధికంగా తినడం వల్ల కడుపులో ఫైబర్ పరిమాణం ఒక్కసారిగా పెరుగుతుంది. దీంతో గ్యాస్ ఫార్మేషన్, అబ్డోమినల్ బ్లోటింగ్ వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) ఉన్నవారిలో ఈ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. శరీరంలో ఫైబర్ అధికమైందని సూచించే కొన్ని లక్షణాలు కూడా ఉంటాయి. తరచూ కడుపు ఉబ్బరంగా ఉండటం, ఎక్కువ గ్యాస్ సమస్య, కడుపు నొప్పి లేదా క్రాంప్స్, ఎప్పుడూ కడుపు నిండిన భావన ఉండటం వంటి సంకేతాలు కనిపిస్తే ఫైబర్ మోతాదును పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**వీరు జాగ్రత్తగా ఉండాలి..**

ముఖ్యంగా వేసవిలో కొంతమంది ఆహారం తీసుకునే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఐబీఎస్, జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు, పిల్లలు, వృద్ధులు, అలాగే ఒక్కసారిగా హై-ఫైబర్ డైట్ ప్రారంభించినవారు జాగ్రత్తగా ఉండాలి. వీరిలో శరీరం ఫైబర్‌ను సరిగ్గా జీర్ణం చేయలేక సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. వేసవిలో ఫైబర్‌ను సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ముడి కూరగాయలకంటే స్వల్పంగా ఉడికించిన కూరగాయలను తినడం జీర్ణక్రియకు సులభంగా ఉంటుంది. ఫైబర్‌ను ఒక్కసారిగా కాకుండా క్రమంగా పెంచడం మంచిది. తగినంత నీరు తాగడం కూడా చాలా అవసరం. ఎందుకంటే నీరు లేకపోతే ఫైబర్ కడుపులో మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**మిశ్రమ ఆహారం తీసుకోవాలి..**

ప్రోటీన్, ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారంతో ఫైబర్‌ను సమతుల్యం చేస్తే జీర్ణవ్యవస్థకు మేలు జరుగుతుంది. సలాడ్లు తిన్న తర్వాత తీవ్రమైన ఉబ్బరం, భోజనం తర్వాత నొప్పి, రోజంతా కొనసాగే జీర్ణ సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. మందులు వేసుకున్నా సమస్య తగ్గకపోతే నిర్లక్ష్యం చేయకూడదు. ఫైబర్ శరీరానికి ఎంతో అవసరం అయినప్పటికీ, మోతాదు, తీసుకునే విధానం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో శరీర పరిస్థితిని బట్టి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం అవసరం. పొట్ట ఇచ్చే సంకేతాలను గమనిస్తూ, తగిన మోతాదులో ఫైబర్ తీసుకోవడం ద్వారా జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

బిజినెస్

## సగానికి తగ్గిన వెంచర్ ఇన్వెస్ట్‌మెంట్స్




వెంచర్ క్యాపిటల్, ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) ఫండ్స్ పెట్టుబడులు గత నెలలో సగానికి క్షీణించాయి. వెరసి ఏప్రిల్‌లో 38 డీల్స్ ద్వారా 2.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా డాలరుతో మారకంలో రూపాయి క్షీణత, రాజకీయ భౌగోళిక ఆందోళనలు దెబ్బతీశాయి. ఐవీసీఏ, కన్సల్టెన్సీ సంస్థ ఈవై విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025 ఏప్రిల్‌తో పోలిస్తే విలువలో 50 శాతం తగ్గాయి. 2026 ఏప్రిల్‌లో 83 లావాదేవీలు నమోదయ్యాయి. ఇవి 29 నెలల కనిష్ఠంకాగా.. గతేడాది ఏప్రిల్‌లో 134, ఈ ఏడాది మార్చిలో 131 ట్రాన్సాక్షన్స్ జరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 96 స్థాయికి పడిపోవడం, అధికస్థాయిలలో కొనసాగుతున్న ముడిచమురు ధరలు, రాజకీయ భౌగోళిక ఆందోళనలు పెట్టుబడులను ప్రభావితం చేసినట్లు ఈవై పార్ట్‌నర్ వివేక్ సోనీ పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రుడెన్సియల్ ఆల్టర్నేటివ్స్ 28.3 కోట్ల డాలర్ల పెట్టుబడులు గత నెలలో నమోదైన అతిపెద్ద డీల్‌గా నివేదిక తెలియజేసింది. బెంగళూరు, పుణేలలో ఆర్ఎంజెడ్ కార్యాలయ ఆస్తులలో ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించింది.

## అందుబాటులోకి ఐటీఆర్--2




**న్యూఢిల్లీ:** ఆదాయపన్ను శాఖ 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025--26 ఆర్థిక సంవత్సరం) ఐటీఆర్--2 (రిటర్నుల పత్రం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై రిటర్నుల దాఖలు సాధ్యపడుతుంది. వ్యాపారం లేదా వృత్తి నుంచి ఎలాంటి ఆదాయం లేని వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు), మూలధన లాభాలు ఆర్జించి ఉంటే ఐటీఆర్--2ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 15న ఐటీఆర్--1, ఐటీఆర్--4 పత్రాలను సైతం ఆదాయపన్ను శాఖ అందుబాటులోకి తేవడం గమనార్హం. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులు ఐటీఆర్--1, 2 దాఖలుకు జూలై 31 తుది గడువుగా ఉంది. అదనంగా, ఈసారి ఐటీఆర్--2 ఫారంలో పన్ను చెల్లింపుదారుల కోసం కొన్ని కీలక మార్పులు చేసినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. ముఖ్యంగా విదేశీ ఆస్తులు, క్రిప్టో కరెన్సీ లావాదేవీలు, అధిక విలువ గల పెట్టుబడుల వివరాలను మరింత స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది. అలాగే ముందుగా నింపిన సమాచారం (ప్రీ--ఫిల్డ్) సౌకర్యాన్ని కల్పించడం వల్ల బ్యాంక్ వడ్డీలు, డివిడెండ్‌లు, టీడీఎస్ వివరాలు ఆటోమేటిక్‌గా కనిపించే అవకాశం ఉంది. దీంతో రిటర్నుల దాఖలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ముకేశ్ అంబానీ వేతనం సున్నా..

## వరుసగా ఆరోసారి జీతం అందుకోని రిలయన్స్ చైర్మన్



**న్యూఢిల్లీ :** దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీ వరుసగా ఆరోసారి ఎలాంటి వేతనం అందుకోలేదు. 2008-09 నుంచి 2019-20 వరకు ప్రతియేటా రూ.15 కోట్ల వార్షిక రెమ్యునేషన్ అందుకున్న ముకేశ్.. 2020-21 నుంచి 2025-26 వరకు ఎలాంటి వేతనం తీసుకోలేదని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం ఆయన డివిడెండ్ మాత్రమే తీసుకుంటున్నారు. కరోనా సమయంలో తన వేతనాన్ని పూర్తిగా విరాళం ఇచ్చిన ఆయన ఆ సమయంలో భవిష్యత్తులో జీతం తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు. ఇక అప్పటి నుంచి(2020-21 నుంచి 2025-26 వరకు) ఇప్పటి వరకు ఎలాంటి వేతనం పొందలేని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.
గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ విడుదల చేసిన వార్షిక నివేదికలో ముకేశ్ అంబానీ ఎలాంటి వేతనం తీసుకోలేదని, అలవెన్స్‌లు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు మాత్రం పొందారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ కన్సాలిడేటెడ్ నికర లాభం 95,754 కోట్ల లాభాన్ని ఆర్జించగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.18,19,103 కోట్లకు చేరుకున్నది. కంపెనీలో 1.61 కోట్ల షేరు కలిగివున్న ముకేశ్ అంబానీ గతేడాదికిగాను రూ.9.66 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపారు. సంస్థలో ప్రమోటర్లు 664.5 కోట్ల షేర్లు లేదా 50.07 శాతం వాటా ఉండటంతో రూ.3,987 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.
అలాగే అంబానీ బ్రదర్స్ నిఖిల్, హితాల్ మెస్వానీలు రూ.25 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. వీటిలో రూ.10 కోట్లు..వేతనం, అలవెన్స్ వంటి రూపంలో ఆయన పొందారు. 2023లో కంపెనీ బోర్డులోకి చేరిన ఆయన పిల్లలు ఇషా, ఆకాశ్, అనంత్‌లు గత ఆరేండ్ల నుంచి ఎలాంటి వేతనం పొందలేదని పేర్కొంది. వీరు కేవలం వేతనం కింద రూ.12.17 కోట్లు(రూ.2.29 కోట్లు కమిషన్ కలుపుకొని) గతేడాదికిగాను పొందారు. కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రామిందర్ సింగ్ గుజ్రాల్, శుమీత్ బెనర్జీ, ఎస్బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య, మాజీ సీవీసీ కేవీ చౌదరి, బ్యాంకింగ్ వెటరన్ కేవీ కామ్‌లు కమిషన్ కింద రూ.2.5 కోట్లు పొందారు. అంతక్రితం ఏడాది అందుకున్న రూ.2.25 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగింది.

**రిటైల్ రంగం అంతంతే: రిలయన్స్**
దేశీయ సంఘటిత రిటైల్ రంగం స్వల్పకాలికంగా ఒత్తిడికి గురికాకతప్పదని రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న స్థూల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం ఇందుకు కారణమని, కానీ, భవిష్యత్తులో ఈ రంగం రెండంకెల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ రూ.3 లక్షల కోట్ల విక్రయాలు జరిపింది.

# రూపాయిని ఇంకా నష్టపోనివ్వాలి..

## మరికొంత కాలం ఆర్బీఐ జోక్యం చేసుకోవద్దు

ముంబై, మే 28: కరెన్సీ మార్కెట్‌లో రూపాయి పతనాన్ని స్వేచ్ఛగా కొనసాగనివ్వాలని, మరికొంత కాలం ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యం చేసుకోవద్దని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. అప్పుడే అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను భారతీయ కరెన్సీ తట్టుకోగలదని వ్యాఖ్యానించారు. అలాగే ద్రవ్యోల్బణం విజృంభిస్తే.. దాన్ని కట్టడి చేసేందుకు వడ్డీరేట్ల పెంపునకు బదులు ఇతర ద్రవ్యపరమైన సాధనాలను వినియోగించాలని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆర్బీఐకి దువ్వూరి సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను వచ్చే వారం ఆర్బీఐ చేపట్టనున్న క్రమంలో దువ్వూరి వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడంలో ద్రవ్య విధానం పాత్ర ఎప్పుడూ చివర్లోనే అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే వడ్డీరేట్ల పెంపుతోనే ద్రవ్యోల్బణం ఆందోళనల్ని తగ్గించవచ్చని విశ్వసిస్తే ఆర్బీఐ ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయవచ్చునని కూడా అన్నారు.

**నిజంగా సవాలే..**
ప్రతికూల పరిస్థితుల్లో రూపాయి మారకం విలువను స్థిరీకరించడం నిజంగా ఓ సవాలేనని దువ్వూరి అన్నారు. కాగా, ఈ నెల 20న డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తొలిసారి 97 మార్కు దరిదాపుల్లోకి వెళ్లింది. దీంతో ఆర్బీఐ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి కొద్దికొద్దిగా కోలుకోవడం మొదలుపెట్టింది. 'మారకం రేటు సంక్షోభాలు చివరకు నమ్మకాన్నే దెబ్బతీస్తాయి. ఒకవేళ మదుపర్లు, దిగుమతిదారులు, ప్రజలు రూపాయి విలువ మరింత పడిపోతుందనే విశ్వసిస్తే.. ఇంకా అప్రమత్తమవుతారు. ఈ పరిణామం రూపాయిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుంది. అప్పుడు లాభాల కోసం ఎగుమతిదారులు తమ డాలర్లను వెనుకకు తీసుకురావడాన్ని ఆలస్యం చేస్తారు. ఫలితంగా దిగుమతిదారులు డాలర్ల కొనుగోలుకు ఎగబడుతారు. ప్రజలు బంగారంపై దృష్టి పెడితే.. మదుపర్లు నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు' అని దువ్వూరి విశ్లేషించారు. ఈ సమయంలోనే ఆర్బీఐ, ఇతరత్రా విధానకర్తలు భయపడకుండా, రక్షణాత్మకంగా కాకుండా సమర్థవంతమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

**తగ్గిస్తే అది.. పెంచితే ఇది..**
'కీలక వడ్డీరేట్లను తగ్గిస్తే దేశ ఆర్థిక వృద్ధికి మద్దతిచ్చినట్టవుతుంది. కానీ ద్రవ్యోల్బణం విజృంభించే ప్రమాదం ఉన్నది. పరిస్థితులు డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనానికీ దారితీయగలవు. అలాగే వడ్డీరేట్లను పెంచితే జీడీపీకి దెబ్బ. కాబట్టి ఈ విషయంలో బ్యాలెన్సింగ్.. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీకి ఎప్పుడూ కత్తి మీద సామే' అని దువ్వూరి అభిప్రాయపడ్డారు. జూన్ 3-5 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష జరుగనున్న విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలు.. దేశీయ మార్కెట్‌లో ఇంధన ధరల్ని ఎగదోస్తున్నాయి. ఇప్పటికే లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు దాదాపు రూ.8 చొప్పున ఎగిశాయి. సీఎన్‌జీ, వంటగ్యాస్ ధరలూ ఎగబాకాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఆర్బీఐ ద్రవ్య సమీక్ష నిర్ణయాలు అత్యంత కీలకమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతం వద్ద ఉన్నది. ఏడాది కిందట 6.50 శాతంగా ఉంటే.. 1.25 శాతం మేర ఆర్బీఐ తగ్గించింది. ఓ

# మరొక్క అడుగు..

# ఫైనల్‌కు చేరేదెవరు?




సాయి సుదర్శన్ - శుభ్‌మన్ గిల్.. నిలకడగా ఆడుతూ ఒక్కొక్క గేర్ మార్చుకుంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే జోడీ..
వైభవ్ సూర్యవంశీ- యశస్వి జైస్వాల్.. విధ్వంసకరమైన బ్యాటర్లు. వచ్చీరాగానే సిక్స్ కొడదామా లేకపోతే ఫోర్‌తో ఇన్నింగ్స్‌ను ఆరంభిద్దామా అనే బ్యాటర్లు..
రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆసక్తికర పోరు వీరిద్దరి మధ్యే అనడంలో సందేహం లేదు. శుక్రవారం జరగనున్న ఈ మ్యాచ్‌లో విజేతగా నిలిచే జట్టు ఫైనల్‌కు చేరుకొని.. కప్పు కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది.

ఓడినా.. ముందుకొచ్చి
ఐపీఎల్ 2026 సీజన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన గుజరాత్ టైటాన్స్ తొలి క్వాలిఫయర్‌లో ఘోరంగా ఓడింది. ఆర్సీబీ బ్యాటర్ల ముందు బౌలింగ్ తేలిపోవడంతో ఏకంగా 254 పరుగులు సమర్పించుకుంది. లక్ష్య ఛేదనలో 162 పరుగులకే కుప్పకూలింది. టాప్ -3 బ్యాటర్లు విఫలమైతే పరిస్థితి ఎలా ఉంటుందో జీటీకి బాగా తెలిసొచ్చింది. ఐపీఎల్ ఆరెంజ్ క్యాప్ రేసులోని సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ నుంచి మంచి ఆరంభం వస్తేనే గుజరాత్ విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. మరోవైపు, మిడిలార్డర్‌లో నిలకడగా ఆడే ప్లేయర్ లేకపోవడం జీటీ బలహీనత. బౌలింగ్ విషయంలో గుజరాత్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవు. గత మ్యాచ్ మినహా మిగతా వాటిల్లో మెరుగైన ప్రదర్శన చేశారు. కగిసో రబాడ (26), రషీద్ ఖాన్ (19), సిరాజ్ (17) ఒక్కసారి లయను అందుకొంటే ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టాలు తప్పవు. సాయి కిశోర్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లతోపాటు జేసన్ హోల్డర్ వంటి పేస్ ఆల్‌రౌండర్ మంచి ఫామ్‌లో ఉన్నారు.

**అలా వచ్చి.. అద్భుత విజయంతో**
రాజస్థాన్ ప్రయాణం చాలా క్లిష్టమైంది. నాకౌట్ స్టేజ్‌కు చేరుకోవడానికే చాలా ఇబ్బందులు పడింది. వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ నుంచి నిలకడగా పరుగులు వస్తున్నాయి. మరోవైపు, యశస్వి, ఫెర్రీరా అప్పుడప్పుడు మినహా.. తమదైన శైలిలో ఈసారి సీజన్‌లో ప్రభావం చూపించలేదు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌పై టాప్ ఆర్డర్ అదరగొట్టినా.. మిడిలార్డర్ ఇబ్బంది పడటంతో అనుకున్నంత మేర స్కోరును సాధించలేదని ఆ జట్టు సారథే చెప్పాడు. రాజస్థాన్ బౌలింగ్ యూనిట్‌ను జోఫ్రా ఆర్చర్ ముందుండి నడిపించాడు. ఎస్ఆర్‌హెచ్‌పై కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించి దెబ్బ కొట్టాడు. అతడికి తోడుగా నాంద్రీ బర్గర్ చెలరేగడం ఆర్ఆర్‌కు కలిసొచ్చింది. రవీంద్ర జడేజా సైలెంట్‌గా వికెట్లు తీస్తూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మరో స్పిన్నర్ యశ్ రాజ్ పుంజా కూడా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు.

**ముఖాముఖి..**
ఇప్పటి వరకు ఐపీఎల్‌లో గుజరాత్ - రాజస్థాన్ జట్లు 10సార్లు తలపడ్డాయి. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ ఏడు మ్యాచుల్లో గెలిచింది. మరో మూడింట్లోనే రాజస్థాన్ విజయం సాధించింది.

స్పోర్ట్స్

## వేలంలోకి వైభవ్ సూర్యవంశీ..

## రూ.30 కోట్లు చెల్లిస్తానన్న సెహ్వాగ్



**ఇంటర్నెట్ డెస్క్:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లోనే 5 ఫోర్లు, 12 సిక్స్‌లు బాది 97 పరుగులు చేశాడు. ఈ సంచలన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్ (59) పేరిట ఉన్న రికార్డును వైభవ్ (65) బ్రేక్ చేశాడు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాళ్లు వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఎలిమినేటర్ మ్యాచ్ సందర్భంగా వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ కామెంటెటరీ చేశారు. వీరి మధ్య వైభవ్ టాపిక్ వచ్చింది. ఒకవేళ సూర్యవంశీ వేలంలోకి వస్తే ఎంత డబ్బు చెల్లిస్తారని సెహ్వాగ్‌ని హర్భజన్ అడిగాడు. సెహ్వాగ్ ఏ మాత్రం ఆలోచించకుండా తాను రూ.30 కోట్లు చెల్లిస్తానని చెప్పాడు.
నచ్చనివాళ్లు.. నీకు 15 ఏళ్లు కాదంటారు: వైభవ్‌కు రస్సెల్ కీలక సూచన
వైభవ్‌లో స్పెషల్ టాలెంట్ ఉంది: అరుణ్ ధుమాల్
ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా వైభవ్‌పై ప్రశంసలు కురిపించారు. అతనిలో 'స్పెషల్ టాలెంట్' ఉందని.. ఈ కుర్రాడు మరింత రాటుదేలడానికి బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ మార్గదర్శకత్వం అందిస్తాయని పేర్కొన్నారు. "వైభవ్ టెంపర్‌మెంట్ ఇలానే కొనసాగేందుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని బీసీసీఐ, రాజస్థాన్ ఫ్రాంఛైజీ అందిస్తాయి. క్రీడల్లో కేవలం శారీరకంగానే కాదు మానసికంగానూ దృఢత్వం అవసరం. అతను రాబోయే మరెన్నో సంవత్సరాలపాటు టీమ్‌ఇండియా తరపున రాణించేలా చూడటంలో మా వంతు కృషిని మేం తప్పకకుండా చేస్తాం" అని అరుణ్ ధుమాల్ తెలిపారు.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132